

**గోషామహల్‌లో పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా నివాళులర్పిస్తున్న నగర కమిషనర్ సజ్జనార్**



హైదరాబాద్ వార్త



# కమ్మేసిన కాలుష్యం

## -గ్రేటర్ దీపావళికి టపాసుల మోత -పరిమితికి మించి శబ్ద వాయుకాలుష్యం



**హైదరాబాద్, అక్టోబరు 21 ప్రభాతవార్త**

గ్రేటర్‌లో కాలుష్యం కమ్ముకుంది. దీపావళి సందర్భంగా సోమవారం రాత్రి పలుచోట్ల ప్రజలు టపాసులు పేల్చారు. పర్యావరణహితంగా దీపావళి పర్వదినాన్ని జరుపుకోవాలని పర్యావరణవేత్తలు, పోలీసులు సూచించినా ఫలితం కనిపించలేదు. సోమవారం నగరంలోని పలు ప్రాంతాల్లో టపాసుల మోత మోగడంతో తీవ్రమైన శబ్ధకాలుష్యంతో పాటు గాలి నాణ్యత విపరీతంగా పడిపోయింది. మంగళవారం తెల్లవారుజామున దట్టమైన పొగ అలుముకుంది. ఎదురుగా ఉన్న వాహనాలు కనిపించలేని పరిస్థితి నెలకొంది. కాలుష్య నియంత్రణ మండలి (పిసిబి) ప్రకారం కాప్రా, జూపార్కు, బొల్లారం, పటాన్‌చెరు, సోమాజిగూడ, సనత్‌నగర్ ప్రాంతాల్లో అధిక వాయు కాలుష్యం వెదజల్లింది. గాలిలో నాణ్యత ప్రమాణాలు పడిపోయాయి. దీంతో వాతావరణం పూర్తిగా కలుషితం అయిపోయింది.దీపావళి సందర్భంగా నగరంలో టపాసుల మోత మోగింది. దీంతో నగరంలో సోమవారం రాత్రి నుంచి అర్ధరాత్రి వరకు తీవ్ర స్థాయిలో కాలుష్యం చోటు చేసుకుంది. కాలుష్య నియంత్రణ మండలి ప్రకారం అత్యధికంగా సనత్‌నగర్‌లో పిఎం 10 స్థాయి -153మైక్రోగ్రామ్ పర్ క్యూబిక్ మీటర్‌గా నమోదైంది. న్యూ మలక్‌పేట 164మైక్రోగ్రామ్ పర్ క్యూబిక్ మీటర్,, కాప్రాలో 140 మైక్రోగ్రామ్ పర్ క్యూబిక్ మీటర్, కోకాపేటలో 134 మైక్రోగ్రామ్ పర్ క్యూబిక్ మీటర్ , సోమాజిగూడలో 122 మైక్రోగ్రామ్‌పర్ క్యూబిక్ మీటర్, రామచంద్రాపురం 122, కొంపల్లి 120మైక్రోగ్రామ్ పర్ క్యూబిక్ మీటర్‌గా నమోదయ్యాయి. ప్రమాదకర స్థాయిలో గాలి నాణ్యత నమోదు కావడంతో పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రీన్ కాకర్స్ కాకుండా పెద్ద ఎత్తున మందుగుండు సామాగ్రి కాల్చినట్లుగా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుతం వాతావరణం చాలా మబ్బుగా కనిపిస్తోంది. పూర్తిగా గాలి నాణ్యత కోల్పోయింది. దీంతో గ్రీన్ క్రాకర్స్ కాకుండా విపరీతంగా రాకెట్లు, బాణాసంచా కాల్చి ఉంటారని అనుమానిస్తున్నారు.

## పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయాన్ని సందర్శించిన శృంగేరి జగద్గురు విధుశేఖర భారతీ మహాస్వామి



మంగళవారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయాన్ని సందర్శించిన శృంగేరి జగద్గురు విధుశేఖర భారతీ మహాస్వామి, పక్క చిత్రంలో ముషీరాబాద్ జ్ఞాన సరస్వతీ దేవాలయాన్ని సందర్శించిన దృశ్యం, చిత్రంలో ఆలయం ధర్మాధికారి కళా జనార్ధన మూర్తి స్వామి తదితరులు

**చిక్కడపల్లి అక్టోబర్ 21 ప్రభాతవార్త:**

శృంగేరి జగద్గురు విధుశేఖర భారతీ మహాస్వామి మంగళవారం శృంగేరి పీఠం ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్న ఆర్టీసీ క్రాస్ రోడ్స్ పంచ ముఖ ఆంజనేయ స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయం ధర్మాధికారి కళా జనార్ధన మూర్తి స్వామి , ఆలయం అర్చకులు వేదమంత్రోచ్చారణ ల పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామి వారు ఆలయంలో కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వర స్వామికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను స్వామివారికి కళా వి ఎస్ జనార్దన మూర్తి వివరించారు. అనంతరం విధుశేఖర భారతీ మహాస్వామి ఆలయం మరింత శోభమాయమానంగా ఉండే విధంగా పలు సూచనలు చేసారు. విధుశేఖర భారతీ మహాస్వామి స్వామి ఆలయానికి వస్తున్న సందర్భంగా చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ సబ్ఇన్స్పెక్టర్ మోనిక నేతృత్వంలో భద్రత చర్యలు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం శృంగేరి జగద్గురు విధుశేఖర భారతీ మహాస్వామి తెలంగాణ పర్యటనకు వస్తున్న సందర్భంగా ఖివైఖి కేటగిరీ భద్రత కలిగిన వ్యక్తి సందర్భంగా ప్రభుత్వ అతిధిగా భావిస్తూ రాష్ట్రంలోని అన్ని జిల్లా కలెక్టరేర్లకు, జిల్లా ఎస్పిలకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు ఉత్తర్వులు జారీ చేశారు. ధర్మాధికారి కళా వి ఎస్ జనార్దన మూర్తి వెంట ఆలయం అర్చకులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

**జ్ఞాన సరస్వతీ దేవాలయం సందర్శన**

కాగా శృంగేరి పీఠం ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్న ముషీరాబాద్ జ్ఞాన సరస్వతీ దేవాలయాన్ని జగద్గురు విధుశేఖర భారతీ మహాస్వామి సందర్శించారు. ఆలయం ధర్మాధికారి కూడా అయిన కళా వి ఎస్ జనార్ధన మూర్తి, వేద పండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.ఆలయంలో ఇటీవల చెప్పుతిన్న పలు అభివృద్ధి కార్యక్రమాలను, చేపట్టబోయే కార్యక్రమాలను స్వామివారికి వివరించారు. ఆలయ మేనేజర్ బండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## చెరువులో బట్టలు ఉతికేందుకు వెళ్లి ఇద్దరు దుర్మరణం

**నార్సింగి, అక్టోబర్ 21 ప్రభాతవార్త :**



పీరంచెరువులో దుర్మరణం చెందిన అమ్మమ్మ యూసుఫ్‌బీ, మనుమరాలు సాబియా మృతదేహాల వద్ద

చెరువులో బట్టలు ఉతికేందుకు వెళ్లి ఇద్దరు దుర్మరణం చెందారు. హృదయ విదా కరమైన ఈ దుర్ఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పీరంచెరువు గ్రామానికి చెందిన యూసుఫ్‌బీ(60) తన మనుమరాళ్లు సాబియా(10), ఆయేష మ్మ(19)లతో కలిసి పీరంచెరువులో బట్టలు ఉతికేందుకు వెళ్లింది. ప్రమాదవ శాత్తు కాలు జారీ యూసుఫ్‌బీ , మనుమ రాలు సాబియా ఇద్దరూ చెరువు నీటిలో పడిపోయారు. గట్టుపై ఉన్న ఆయేషమ్మ ఎంత అరిచినా వారు ఈత రాక నీటిలో మునిగి మృతి చెందారు. ఆమె ఏడుచుకుంటూ తన ఇంటికి వెళ్లి జరిగిన విష యంను కుటుంబ సభ్యులకు తెలిపింది. యూసుఫ్‌బి అల్లుడు స్థానికుల సహాయంతో చెరువులోకి దిగి యూసుఫ్‌బి, సాబియాల మృతదేహాలను బయటకు తీశారు. విషయం తెలుసుకున్న నార్సింగి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టు మార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నార్సింగి పోలీసులు తెలిపారు.

## స్క్రాప్ గోదాంలో అగ్ని ప్రమాదం

### - పాత బీరువాలు, కుర్చీలు, కార్లు దగ్ధం

**చార్మినార్,అక్టోబరు 21 ప్రభాతవార్త :**



స్క్రాప్ గోదాంలో మంటలు

హైదరాబాద్ పాతబస్తీలో ఓ పాత వస్తువుల గోదాంలో జరిగిన అగ్ని ప్రమాదంలో పాత బీరువాలు,కుర్చీలు,రెండు కార్లు కాలిపోయిన సంఘటన కామాటిపుర పోలీస్ స్టేషన్ పరిధిలోచోటు చేసుకుంది.పోలీసుల కథనం ప్రకారం... పాతబస్తీకి చెందిన తరుణ్ కుమార్ అగర్వాల్‌కు బహదూర్‌పు మండల కార్యాలయం సమీపంలో భవనం ఉంది.భవనం ఆవరణలో స్క్రాప్ గోదాంను నిర్వహిస్తున్నారు.పాత బీరువాలు ,కుర్చీలకు మరమ్మతులు చేసి అమ్ముతుం టారు.గోదాం మూసి వేసి ఉంది.దీపావళీ సందర్భంగా సోమవారం అర్ధ రాత్రి దాటిన తర్వాత టపాకాయలు విడిచిపెట్టిన టపాకాయల నిప్పులు గోదాం లోని స్క్రాప్‌పై పడ్డాయి.గోదాంలో ఉన్న చెత్త,ఆకులు అంటుకుని మంటలు లేచాయి.గోదాంలోని పాత కుర్చీలు,బీరువాలు కాలిపోయా యి.గోదాం ఆవరణలో ఉన్న రెండు కార్లు కూడ కాలి పోయాయని పోలీసులు తెలిపారు.సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఫైర్ ఇంజన్లు రప్పించి మంటలను ఆర్పివేశారు.ఈ కేసును కామాటిపుర పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# దీపావళి పండుగలో అపశృతి...



రంగారెడ్డి జిల్లా పొద్దుటూరు గ్రామానికి చెందిన అంజయ్య కంటికి సర్జరీ నిర్వహించిన ఆసుపత్రి వైద్యులు...

**-టపాసులు కాలుస్తూ కంట్లో నిప్పురవ్వలు పడి 72 మందికి గాయాలు...**

**-ఇద్దరికి సర్జరీ మరొకరికి బుధవారం సర్జరీ**

**-వారం రోజులు గడిస్తే గాని చూపు వస్తుందో లేదో చెప్పలేం**

**-కంట్లో గాయాలైన వారిలో చిన్నారులు 20 మంది**

**మెహిదీపట్నం అక్టోబర్ 21, ప్రభాతవార్త :**

దీపావళి పండుగలో అపశృతి నెలకొంది. పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని క్రాకర్స్ కాలుస్తుండగా కొందరి కళ్ళకు గాయాలైనాయి. పండుగలో టపాసులు కాలుస్తూ సోమ, మంగళ వారాల్లో 72 మంది గాయాలై మెహిదీపట్నం సరోజినీ దేవి కంటి ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారు. ఇందులో 20 మంది చిన్నారులు ఉండగా... ఐదుగురిని ఆసుపత్రిలో అడ్మిట్ చేసుకొని ఇద్దరికీ సర్జరీ నిర్వహించారు. మరొకరికి బుధవారం సర్జరీ నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి ఆర్ఎంవో మహమ్మద్ ఇబ్రహీం తెలిపారు. గత రెండు రోజులుగా ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం ప్రత్యేకమైన వైద్యుల టీంలను ఏర్పాటు చేసినట్లు, డాక్టర్లు అందరూ అందుబాటులో ఉంటారని తెలిపారు. దీపావళి పండుగ సందర్భంగా 72 మందికి కంట్లో నిప్పురవ్వలు పడి గాయాలయ్యాయని ఇందులో 23 మందికి చూపు తగ్గిందని వారికి చికిత్సలు నిర్వహించినట్లు తెలిపారు. వచ్చిన 72 మందిలో అందరికీ ప్రాథమిక చికిత్సలతో పాటు ప్రత్యేకమైన పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. 23 మందికి చూపు తగ్గిందని వారికి వారం రోజులపాటు కంట్లో డ్రాప్స్ వేసుకోవాలని సూచించడం జరిగిందన్నారు. చూపు ఎంతవరకు తగ్గిందనేది వారం రోజుల తర్వాత తెలుస్తుందని ఆ తర్వాతే వారికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమనుకుంటే ఆపరేషన్లు చేస్తామని తెలిపారు. కాగా ప్రస్తుతానికి ఆసుపత్రిలో అత్యవసరంగా ఇబ్రహీంపేట్ గ్రామం బాన్సువాడ ప్రాంతానికి చెందిన దుర్గాప్రసాద్ 10 సంవత్సరాల బాలుడితో పాటు రంగారెడ్డి జిల్లా పొద్దుటూరు గ్రామానికి చెందిన అంజయ్య 36 కు టపాసులు బాంబులు పేలి కండ్లలో నిప్పురవ్వలు పడి కన్ను ప్రమాద స్థాయికి చేరుకొందని, అందుకు వీరికి అత్యవసరంగా మంగళవారం సర్జరీ చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా ఆస్పత్రిలో అడ్మిట్ అయినవారిలో మరొకరికి బుధవారం సర్జరీ కొనసాగుతుందని తెలిపారు. వీరికి మరో వారం రోజులు గడిస్తే కానీ చెప్పలేమని సున్నితమైన కండ్లను వైద్య చికిత్సలు చేస్తున్నట్లు చెప్పారు. గత సంవత్సరం 48 కేసులు రాగా ఇద్దరికీ ఆపరేషన్లు చేసినట్లు వైద్యులు పేర్కొన్నారు. టపాసులు కాలుస్తుండగా కళ్ల ద్దాలతో పాటు వదులుగా ఉండే దుస్తులను వేసుకోవాలని దీంతో పాటు పలు జాగ్రత్తలు పాటిస్తే ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోవని సరోజినీ దేవి కంటి ఆసుపత్రి ఆర్ ఎం ఓ ఇబ్రహీం ప్రజలకు సూచించారు.



బాలుడు దుర్గాప్రసాద్ కంటిలో నిప్పురవ్వలు పడి ఆస్పత్రిలో సర్జరీ నిర్వహించిన వైద్యులు...



సరోజినీ దేవి కంటి ఆసుపత్రిలో చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు.

# నిరసన గళం.. నామినేషన్ల పర్వం

**- నామినేషన్లు దాఖలు చేసిన ఆర్ఆర్ఆర్, ఫార్మసిటీ, నిరుద్యోగులు, సంఘాలు**

**జూబ్లీహిల్స్, అక్టోబరు 21, ప్రభాతవార్తః**

ఒకొక్కరిది ఒక్కో సమస్య.. ఎన్నో సార్లు తమ గోడును, గోసను, సమస్యను అధికారుల, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.. అయినా ఎవరూ స్పందించలేదు.. వారి బాధ తీరలేదు.. తమ గోడు, బాధ తెలియజేసేందుకు వారంతా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలను వేదికగా చేసుకున్నారు.. నామినేషన్లు వేసి తమ సమస్యను తెర ఇప్పుడు మరోసారి తెర మీదకు తీసుకొచ్చారు.. ప్రభుత్వానికి తమ నిరసనను ఎన్నికల్లో అభ్యర్థులుగా నిలిచి తెలియజేసేందుకు సిద్దమయ్యారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో 18వ తేది నాటికి 127 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో రిజిస్టర్ పార్టీల నుంచి, స్వతంత్ర అభ్యర్థులుగా ఇప్పటివరకు చాలా మందినామినేషన్లు దాఖలు చేశారు. కాగా నామినేషన్లకు చివరి రోజైన మంగళవారం పెద్దఎత్తున నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో ప్రధానంగా ఫార్మాసిటీ బాధితులు, ఆర్ఆర్ఆర్ బాధితులు, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం, మాల మహానాడు నుంచి పదుల సంఖ్యలో నామినేషన్లు వేశారు. హుస్సేన్ అనే వ్యక్తి బీఆర్ఎస్, కాంగ్రెస్ కండువాలతో నామినేసన్ వేసేందుకు వచ్చారు. గతంలో ఉన్న బీఆర్ఎస్, ఇప్పుడున్న కాంగ్రెస్ తనకు అన్యాయం చేసిందని అందుకే నామినేషన్ వేయడానికి వచ్చినట్లు తెలిపారు. ఇక కానిస్టేబుల్‌గా పనిచేసి ఉద్యోగం కోల్పోయిన సంజయ్ సైతం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో అభ్యర్థిగా నామినేషన్ వేశారు. వీరే కాదు.. చాలా మంది తమ సమస్యలను, ప్రజా సమస్యలను తీర్చేందుకు నామినేషన్లు దాఖలు చేశారు.



నామినేషన్ వేసిన తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ సభ్యులు

**జీఓ 31ని రద్దు చేయాలని..**

ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ 31ని రద్దు చేయాలని ఫార్మాసిటీ బాధితులు నామినేషన్ దాఖలు చేశారు. 11 మంది బాధితులు ఇక్కడ నామినేషన్లు వేశారు. ఫార్మా సిటీ భూసేకరణ చేసే ముందు కనీసంగా రైతుల అభిప్రాయాలను సేకరించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్లకార్డులు ప్రదర్శించి తమ నిరసనను వ్యక్తం చేశారు. తమకుపరిహాదరం వద్దని, తమ భూమి తమకు కావాలని, మాట ఇచ్చిన విధంగా జీవోను రద్దు చేయాలని, కర్ణాటక తరహాలో ఇక్కడ సైతం భూసేకరణను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్ఆర్ఆర్ బాధితులు సైతం చాలా మంది ఇక్కడికి తరలివచ్చారు. తమ గళాన్ని ఈ ఎన్నిక ద్వారా తెలియజేసేందుకు ఇక్కడికి వచ్చినట్లు వారు వివరించారు.



ఎన్నికల నామినేషన్ కేంద్రానికి వస్తున్న ఆర్ఆర్ఆర్ బాధితులు

**విశ్రాంత ఉద్యోగులు..**

విశ్రాంత ఉద్యోగులు తమ రిటైర్డ్ సదుపాయాలను ఇప్పటివరకు అందుకోలేదు. మార్చి 2024 నుంచి ఇప్పటివరకు దాదాపు ఎనిమిది వేల మంది ఉద్యోగులకు సంబంధించి బెనిఫిట్స్ చెల్లించాల్సి ఉందని, ప్రభుత్వం ఇప్పటివరకు రూపాయి సైతం చెల్లించలేదని ఆరోపించారు. ఈ నేపథ్యంలోనే దాదాపు పది మంది విశ్రాంత ఉద్యోగులు ఇక్కడ నామినేషన్లు వేశారు. తమకు ఒకొక్కరికి రూ. 50లక్షల నుంచి కోటి రూపాయల వరకు రావాల్సి ఉందని ఉన్నారు. వీరితోపాటు ఓయూ జేఏసీ నిరుద్యోగులు సైతం నామినేషన్లు వేశారు. తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ నుంచి సైతం పెద్దఎత్తున నామినేషన్లు దాఖలు చేశారు. ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ ఈ నామినేషన్లను దాఖలు చేసినట్లు ఆయా సంఘం అధ్యక్షుడు రాంచందర్ తెలిపారు.

## సదర్‌కు హాజరుకావల్సిందిగా మాజీ మంత్రులకు ఆహ్వానం



సదర్‌కు హరీష్‌రావును ఆహ్వానిస్తున్న ఎడ్ల హరిబాబు యాదవ్

ముషీరాబాద్, అక్టోబర్ 21, ప్రభాతవార్త: ఈనెల 22న నారాయణ గూడలో జరగనున్న సదర్‌కు హాజరుకావల్సిందిగా మాజీ మంత్రులు హరీష్‌రావు, తలసాని శ్రీనివాసయాదవ్‌లను తెలంగాణ రాష్ట్ర సదర్ ఉత్సవ సమితి ప్రతినిధులు ఆహ్వానించారు. ఈ మేరకు మంగళవారం తెలంగాణ రాష్ట్ర సదర్ ఉత్సవ సమితి ప్రతినిధులతో కలసి ఉపాధ్యక్షులు, బీఆర్ఎస్ సీనియర్ నేత ఎడ్ల హరిబాబు యాదవ్ మాజీ మంత్రుల నివాసాలకు వెళ్లి ఆహ్వాన పత్రికలు అందచేశారు. ఎంతో అంగరంగ వైభవంగా యాదవ సోదరులు నిర్వహించే సదర్‌కు తప్పకుండా హాజరవుతామని వారు హామీ ఇచ్చారు.

## పరికె చెరువు కబ్జాలపై తక్షణ చర్యలు తీసుకోవాలి

**-కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డికి విజ్ఞప్తి**



పరికె చెరువును పరిశీలిస్తున్న హన్మంత్‌రెడ్డి

**జగద్గిరిగుట్ట, అక్టోబర్ 21, ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 126వ డివిజన్ జగద్గిరిగుట్ట పరిధిలోని భూదేవి హిల్స్‌లో ఉన్న పరికె చెరువు కబ్జాలకు గురవుతున్న నేపథ్యంలో మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి భూదేవి హిల్స్‌ను సందర్శించి, చెరువును కబ్జా చేసే వ్యక్తులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను, హైడ్రా కమిషనర్‌ని కోరారు. అలాగే, చెరువు చుట్టూ కంచ వేసి ప్రజలకు ఉపయోగపడే విధంగా సుందరీకరణ పనులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు గణేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు అవిజె జేమ్స్, డీసీసీ ఉపాధ్యక్షులు శ్రవణ్ కుమార్, సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, రషీద్, కృష్ణ గౌడ్, లక్ష్మ రెడ్డి, గోరె భాయ్, నరేందర్ రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ కన్వీనర్ చంద్రయ్య, బేకు శ్రీనివాస్, పండరి, సోమన్నా శ్రీధర్ రెడ్డి, ఎం.డి. జాకీర్, సంతోష్, ఎం.డి. లాయక్, పెరిక శివ, భరత్ గౌడ్, వేణు గౌడ్, పిల్లి ఆంజనేయులు, మహిళా నాయకులు కౌసల్య, అనిత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విహెచ్ నివాసంలో నేడు సత్యనారాయణ వ్రతం



విహెచ్‌కు దీపావళి శుభాకాంక్షలు తెలుపుతున్న తొలుపునూరి కృష్ణగౌడ్, చిత్రంలో ఆర్.లక్ష్మణ్‌యాదవ్, నారాయణస్వామి, దిడ్డి రాంబాబు, గరిగంటి రమేష్ తదితరులు

**హైదరాబాద్, అక్టోబరు 21 ప్రభాతవార్త:**

మాజీ పిసిసి అధ్యక్షుడు, మాజీ ఎంపి వి.హనుమంతరావు అంబర్‌పేటలోని తన నివాసంలో సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించనున్నారు. బుధవారం సాయంత్రం 7 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకానున్నారు. కాగా, దీపావళి పండుగ సందర్భంగా వి.హనుమంతరావును కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఆర్.లక్ష్మణ్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు నారాయణస్వామి, దిడ్డి రాంబాబు, గరిగంటి రమేష్, కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోలుపునూరి కృష్ణగౌడ్, పార్టీ సీనియర్ నాయకులు పంజాల వెంకటేష్ గౌడ్, గడ్డం శ్రీధర్‌గౌడ్, శ్రీమంత్ గిరి తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై విజయం సాధించిన సందర్భంగా దీపావళి జరుపుకోవడం జరుగుతుందని, త్వరలో జరగనున్న జూబ్లీహిల్స్ ఎన్నికలలో కూడా చెడుపై విజయం సాధిస్తుందని ఈ సందర్భంగా విహెచ్ జోస్యం చెప్పారు.

## చందానగర్‌లో పగిలిన మంజీరా పైప్‌లైన్

**వృధాగా పోతున్న తాగునీరు**



చందానగర్ శ్వేతాగార్డెన్ వద్ద పగిలిపోయిన మంజీరాపైప్‌లైన్

**శేరిలింగంపల్లి, అక్టోబర్ 21 ప్రభాతవార్త**

శేరిలింగంపల్లి నియోజక వర్గంలోని చందానగర్‌లో మంజీరాపైపలైన్ పగిలి మంచినీరు ఎగిసిప్రవహించింది. మంజీరాపైప్‌లైన్ గేట్ వాల్ వద్ద లీకేజీతో మంచినీరు దాదాపు 15మీటర్ల ఎత్తులో ఎగిసి పడింది. దీనికి పైనే విద్యుత్ వైర్లు ఉండటంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. చందానగర్ పరిధిలోని శ్వేతాగార్డెన్ సమీపంలో మంజీరా నీటి పైప్‌లైన్లలో తరచూ ఇలాంటి లీకేజీలు ఏర్పటం సహజంగా మారింది. నగరానికి మంజీరానీటిని అందించేందుకు నిర్మించిన ఈ పైప్‌లైన్ పగలటంతో వేలగ్యాలన్ల తాగునీరు వృధాగా రోడ్డుపై ప్రవహించింది. ఈ పైప్‌లైన్ పగిలిపోవడంతో అటువైపుగా రాకపోకలను నిలిపివేశారు.అధికారులు రంగప్రవేశం చేసి పగిలిపోయిన మంజీరాపైప్‌లైన్‌ను మరామ్మత్తు చేసేందుకు సిద్దమయ్యారు.కాగా గతంలో కూడా శ్వేతాగార్డెన్ సమీపంలో మంజీరా పైప్‌లైన్లు పగిలిపోవడం,తాగునీరు వృదాకావడం పరిపాటిగా మారుతుందని,అధికారులు చర్యలు తీసుకోవాలనిస్థానికులు కోరుతున్నారు.

## తలసాని నివాసంలో దీపావళి వేడుకలు



దీపావళి వేడుకల్లో పాల్గొన్న తలసాని శ్రీనివాస్‌యాదవ్

**జూబ్లీహిల్స్, అక్టోబరు 21, ప్రభాతవార్త:**

మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ నివాసంలో సోమవారం రాత్రి దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. జూబ్లీహిల్స్ నివాసంలో ఆయన కుమారుడు తలసాని సాయికిరణ్‌యాదవ్, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. మనువడితో కలిసి టపాసులు పేల్చి ఆనందాన్ని పంచుకున్నారు.

# నయా నరకాసురుడు రేవంత్‌రెడ్డి : హరీష్‌రావు

**- మూసీ సుందరీకరణ పేరుతో పేదలను భయబ్రాంతులకు గురి చేస్తుండు**
**- రేవంత్ వచ్చాక తెలంగాణలో రియల్ వ్యాపారం కుదేలైంది**
**- పేదలకు ఆపదల్లో, ఆనందాల్లో బిఆర్ఎస్ అండ**



హైదర్షాకోట్‌లోని మూసీ పరివాహక ప్రజల మధ్య దీపావళి వేడుకలు జరుపుకొని, మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీష్‌రావ్.

**నార్సింగి, అక్టోబర్ 21 ప్రభాతవార్త :** నయా నరకాసురుడు రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పాలన విరుగడ అయిన రోజే తెలంగాణ ప్రజలకు నిజమైన దీపావళి పండగ వస్తుందని మాజీ మంత్రి టి.హరీష్‌రావ్ పేర్కొన్నాడు. గండిపేట మండలం హైదర్షాకోట్‌లో మూసీ పరివాహక ప్రజలు, నిరుపేదల మధ్య కార్తిక్‌రెడ్డితో కలిసి దీపావళి పండగను హరీష్‌రావ్ జరుపుకున్నారు. ఈ సందర్భంగా పేద పిల్లలకు బాణాసంచాను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభా వేదిక పైనుంచి హరీష్‌రావ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై, సీఎం రేవంత్‌రెడ్డి పాలనపై పదునైన విమర్శలు చేశారు. నాడు ప్రజాకంటకులను తుద ముట్టించిన తరువాత ప్రజలు దీపావళిని జరుపుకున్నారని, నేడు తెలంగాణలో నయా నరకాసూరుడు రేవంత్ పాలన విరుగడ పొందిన రోజునే అసలైన దీపావళిని ప్రజలు జరుపుకుంటారన్నారు. కేసీఆర్ హైదరాబాద్‌లో లక్ష డబుల్ బెడ్ రూం ఇళ్లను కట్టించాడని, లక్షలాది మందికి 58,59.జీవోల కింద పట్టాలు పంపిణీ చేశారని వివరించారు. రేవంత్‌రెడ్డి రెండేళ్ల పాలనలో లక్ష ఇళ్లను కూల్చాడని, ఒక్క ఇళ్లును కూడా కట్టలేదని ఆరోపించారు. హైడ్రా పేరుతో పేద ప్రజలను భయబ్రాంతులకు గురి చేయడం మానుకోవాలని హితవు పలికారు. పేదలు, ఉద్యోగులు పైసా పైసా కూడబెట్టుకొని ఇళ్లు కట్టుకుంటే నేడు మూసీ సుందరీకరణ పేరుతో వాటిని కూలుస్తామంటూ మార్కింగ్ వేయడం దారుణమన్నారు. పేదలకు అండగా బిఆర్ఎస్ ఉందని, ప్రజల తరపున ఉద్యమించి, కోర్టుల్లో కేసులు వేశామని వివరించారు. నాడు ఆపదలో మీ హైదర్షాకోట్‌కు వచ్చామని, ఇప్పుడు ఆనందం వేళలో కూడా మీతో గడుపాలని ఇక్కడికి వచ్చామన్నారు. సీఎం సోదరుడికి, పొంగులేటి, మహేందర్‌రెడ్డిల వద్దకు ఎందుకు హైడ్రా వెళ్లడం లేదని, దీన్ని బట్టే హైడ్రా ఎంత పక్షపాతంతో పని చేస్తుందో అర్థం చేసుకోవచ్చన్నారు. నాడు సీఎం కేసీఆర్ కాళేశ్వరంను కట్టి, మల్లన్న సాగర్ మీదుగా మూసీకి గోదావరి నీటిని తరలించి స్వచ్ఛమైన నీటిని హైదరాబాద్‌లో పారించే ప్రణాలికలు రూపొందించారన్నారు. నేడు రేవంత్‌రెడ్డి మూసీ సుందరీకరణ పేరుతో పేదలను భయబ్రాంతులకు గురి చేస్తూ, వారికి కంటిమీద కునుకు పోనివ్వడం లేదన్నారు. బడా పారిశ్రామిక వేత్తల కోసం పేదల ఇళ్లను కూల్చడం మానుకోవాలని, ఖాళీ స్థలాలల్లో మాత్రమే సుందరీకరణ పనులు చేయాలని, పేదల ఇళ్ల జోలికి వస్తే బీఆర్ఎస్ అడ్డుకొని తీరుతుందన్నారు. జూబ్లీహిల్స్‌లో చాలా మంది మీ స్నేహితులు, బంధువులు, తెలిసిన వారుంటారని మీరు అక్కడికెళ్లి బీఆర్ఎస్‌కు ఓటు వేయించాలని కోరారు. అప్పుడు ఈ ప్రజా వ్యతిరేక సర్కారుకు బుద్ధి వస్తుందని, ఒళ్లు దగ్గర పెట్టుకొని పని చేస్తుందని హరీష్‌రావ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ అధ్యక్షులు నాగరాజు, విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి, నాయకులు ముక్తార్ పాషా, తలారి పాండు, రాముడు, వెంకటేష్, శాంతి నాయక్ పాల్గొన్నారు.

## పాటకు అభిమానులు కాని వారు ఉండరు : డాక్టర్ నరసింహా రెడ్డి



డాక్టర్ ఏనుగు నరసింహా రెడ్డిలను సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి అక్టోబర్ 21 ప్రభాతవార్త:** ఎట్టి పాట ఇనా ప్రతి వారి మనసుకు తాకుతుంది అని భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ ఏనుగు నరసింహా రెడ్డి అన్నారు పాటకు అభిమానులు కాని వారు ఎవరూ ఉండరు అని చెప్పారు శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యం తో మల్లెల కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏనుగు నరసింహా రెడ్డి కి ప్రముఖ గాయకుడు ప్రసాద్ కొమ్మరాజు కు ఆత్మీయ సత్కారం జరిగింది ఈ సందర్భంగా ఏనుగు నరసింహా రెడ్డి మాట్లాడుతూ సత్కారం కన్నా నేను రాసిన కవితలు వేదిక పై ఎవరైనా ప్రస్తావన చేస్తే అదే నాకు గొప్ప సన్మానం అని భావిస్తాను అన్నారు సత్కారం చేసిన గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి కి మల్లెల సంస్థ వసుంధరకు ధన్య వాదాలు తెలిపారు అధ్యక్షత వహించిన గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి మాట్లాడుతూ ప్రపంచ తెలుగు మహా సభలు విజయవంతం కావటం లో నరసింహా రెడ్డి కృషి విస్మరించలేము అన్నారు మంచి కవి మాత్రమే కాదు విషయం పూర్తి అవగాహన తో ప్రసంగించ కల వక్త అన్నారు వేదిక పై గాయకుడు ప్రసాద్ కొమ్మరాజు (అమెరికా) ను సంస్థ పక్షాన ఆత్మీయ సత్కారం చేశారు వేదిక పై అణు శాస్త్ర వేత్త విశ్వనాథ్ కళాభిమాని వినోద్ గాయని కమలాశాస్త్రి, శరత్ కృష్ణ తదితరులు పాల్గొనగా కళ్యాణ్ వ్యాఖ్యానం లో శరత్ కృష్ణ నాగ భూషణం కృష్ణ మోహన్ పద్మ అనురాధ జ్యోతి శ్రీదేవి అపర్ణ తదితరులు మధురమైన పాటలు పాడారు సంస్థ అధ్యక్షులు మల్లెల వసుంధర స్వాగతం పలికారు.

## నేటి నుండి ఆంజనేయ స్వామి దేవాలయంలో కార్తీక మాసోత్సవాలు



వివరాలు వెల్లడిస్తున్న వివేక్ నగర్ శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ జానకి సుధాకర్, ఈఓ మాచర్ల దేవనాథం

**చిక్కడపల్లి అక్టోబర్ 21 ప్రభాతవార్త:** వివేక్ నగర్ శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో కార్తీక మాసోత్సవాలను వైభవంగా నిర్వహించబోతున్నట్లు ఆలయం పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ జానకి సుధాకర్, ఈఓ మాచర్ల దేవనాథం వివరించారు. బుధవారం నుండి నవంబర్ 20 వ తేదీ వరకు ఈ ఉత్సవాలు జరుగుతాయని. ప్రతి రోజు ఉదయం ఏడు గంటలకు మహన్యాసపూర్వక రుద్రాభిషేకాలు, ప్రతి రోజు సాయంత్రం ఆరున్నర గంటలకు ఆకాశ దీపోత్సవం, ప్రతి సోమవారం ఉదయం పది గంటలకు ఏకవార రుద్రాభిషేకాలు, ప్రతి గురువారం అన్నాభిషేకం, ప్రతి రోజు సోమవారం సాయంత్రం ఏడు గంటలకు ప్రదోషకాలపూజ ఉంటాయన్నారు. నవంబర్ రెండవ తేదీన, తులసి కృష్ణ కళ్యాణం, అయిదవ తేదీన శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు, పదిహేనవ తేదీన జ్వాలాతోరణం,పద్దెనిమిదవ తేదీన మాస శివరాత్రి సందర్భంగా సాయంత్రం ఏడు గంటలకు శివపార్వతుల కళ్యాణం ఉంటుందని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ సమావేశంలో ఆలయం ముఖ్య అర్చకులు బుగ్గాలక్ష్మీపతి శర్మ, అర్చకులు కందాళ వేంకటాద్రి, ఆలయం కమిటీ సభ్యులు జి. పద్మావతి, నిర్మల, ముక్క రామకృష్ణ, గండి హరీష్, నెల్లి శ్యాం కుమార్ ముదిరాజ్, నేత రాణి, ఎం. లక్ష్మీనారాయణ రావు, కంది సుబ్బారావు, అమర బాలా కుమార్, దాసరి నవీన్ ప్రసాద్, వెన్నెలకంటి వెంకట శివ కుమార్, కొత్తూరి వెంకట ప్రతాప్ కుమార్, తెలగంశెట్టి లోకనాథ్, మురికి గణేష్, ఎం.బి. రామకోటేశ్వర్ రావు, ఒరుగంటి మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌పాలనలో బస్తీ దవాఖానాలకు సుస్తీ : మాజీ మంత్రి హరీశ్‌రావు



లింగంపల్లి బస్తీ దవాఖానాను పరిశీలించిన మాజీ మంత్రి హరీశ్‌రావు

**శేరిలింగంపల్లి, అక్టోబర్ 21 ప్రభాతవార్త**

కాంగ్రెస్ పాలనలో బస్తీ దవాఖానాల పరిస్థితి ఘోరంగా మారిందని తెలంగాణ రాష్ట్ర మాజీ ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని బస్తీదవాఖానను మాజీ మంత్రి హరీశ్‌రావు సందర్శించారు. బస్తీ దవాఖానాలో వైద్యవసతులపై రోగులను ఆరాతీశారు. దవఖానా సిబ్బందిని కలుసుకుని వారితో బస్తీ ఆసుపత్రులు నడుస్తున్న తీరుతెన్నులపై వివరాలను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. పేద ప్రజలకు వైద్య,ఆరోగ్య సేవలను అందించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వ హాయాంలో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో ముందుచూపుతో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాలు కేంద్రప్రభుత్వ గుర్తింపును పొందినవని ఆయన అన్నారు. నగరంలో దాదాపు 4500 బస్తీ దవాఖానాలను కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేయటం జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక బస్తీ దవాఖానాలకు సుస్తి పట్టిందన్నారు. గత ఆరునెలలుగా బస్తీ దవాఖానాలలో పనిచేసే సిబ్బందికి జీతాలు ఇవ్వడం లేదని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం ప్రతినెల జీతాలు ఇస్తున్నామని చెబుతుండటం విడ్డూరంగా ఉందన్నారు. కనీసం ఆసుపత్రులల్లో బీ12,హార్ట్‌కు సంబంధించిన మెడిసన్స్, అత్యవసర మందులేవీ అందుబాటులో లేవని,వైద్య పరీక్షలు లేవని ఆయన అన్నారు. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో బస్తీ దవాఖానాలను సక్రమంగా ఆర్గనైజ్ చేయకపోవడం విచారకమన్నారు. ఆరోగ్య శ్రీ బకాయిలు విడుదల కావడంలేదని, గతంలో తమ హాయాంలో పదివేల కోట్లను విడుదల చేసి ఆరోగ్యశ్రీకి కేటాయించటం జరిగిందన్నారు. ఈహెచ్ఎస్, జేహెచ్ఎస్ వంటి స్కీమ్‌లు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేస్తుందని, జర్నలిస్టులకు, ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హెల్త్‌కార్డులు పనికిరాకుండా పోతున్నాయన్నారు. నిరుపేద ప్రజలకు వైద్య,ఆరోగ్య సేవలను అందించటంలో కాంగ్రెస్‌ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మాదవరం రంగారావు, వి. ఆదర్శ్‌రెడ్డి,స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## డిసెంబరు 5,6 తేదీలలో 'గోబల్ టిపిఓ అండ్ హెచ్‌ఆర్ సమ్మిట్-2025'



బ్రోచర్‌ను ఆవిష్కరించిన జయరాం

**సైఫాబాద్, అక్టోబరు 21 ప్రభాతవార్త:**

విద్యార్థులకు నైపుణ్యత, ఉద్యోగాల కల్పన అనే అంశాలపై చర్చించేందుకు డిసెంబరు 5, 6 తేదీలలో గచ్చిభౌలిలోని 'గ్లోబల్ టిపిఓ అండ్ హెచ్‌ఆర్ సమ్మిట్-2025'ను గచ్చిభౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పటల్స్ మేనేజ్‌మెంట్‌లో నిర్వహిస్తున్నామని తెలంగాణ అండ్ టిపిఓ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రొఫెసర్ జయరాం తెలిపారు. ఈ మేరకు బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి బ్రోచర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉద్యోగ కల్పనే ధ్యేయంగా తెలంగాణ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ పెద్ద ఎత్తున కృషి చేస్తున్నదని, అందులో భాగంగానే ఈ సమ్మిట్ ఈ డిసెంబరు 5వ తేదీన నిర్వహిస్తున్నామని, ఇందులో పలు దేశాలు, మన దేశంలోని 24 రాష్ట్రాల ప్రతినిధులు, హెచ్‌ఆర్‌లు హాజరవుతారని ఆయన వివరించారు. ఈ సందర్భంగా నిపుణులు విద్యార్థులకు, ప్రతిభ, సాంకేతిక, పారిశ్రామిక, పర్యాటక అంశాలపై సలహాలు, సూచనలు అందిస్తారని, 6న అవార్డుల ప్రదానోత్సవం జరుగుతుందని చెప్పారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు ప్రొఫెసర్ దేవిశ్రీప్రసాద్, ప్రశాంత్, సతీష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసంగమేశ్వర దేవాలయంలో నేత్రపర్వంగా కార్తీకమాస మహోత్సవాలు

**-ఆకాశ దీపారాధనతో అంకురార్పణ**

**నాంపల్లి, అక్టోబరు 21 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో గాంధీనగర్ ఎస్‌బిహెచ్ కాలనీ వద్దనున్న అతిపురస్కార శైవక్షేత్రం శ్రీసంగమేశ్వర, శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో నవంబర్ 20 గురువారం జరిగే కార్తీకమాస మహోత్సవాలు మంగళవారం రాత్రి 6.30 గంటలకు భక్తిశ్రద్ధలతో ఆకాశ దీపారాధనతో అంకురార్పణ నేత్రపర్వంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లక్ష్మారెడ్డి, ఛైర్మన్ బి.సి.వెంకటేశ్వర రావులు కార్తీకమాస మహోత్సవ ప్రత్యేక పూజాకార్యాక్రమాల వివరాలు వెల్లడించారు. 25 శనివారం నాగులచవితి; 26 ఆదివారం ఉ.9గంటలకు విభూత్యాభిషేకం; 27 మొదటి కార్తీక సోమవారం ఉదయం 4గంటలకు మహాన్యాసపూర్వక ఏకదశవార రుద్రాభిషేం, ఉదయం 7.30-9-10.30-12లకు, సాయంత్రం 5లకు ఏకవార రుద్రాభిషేకములు; నవంబరు 1 శనివారం ఉదయం 9.30లకు సామూహిక సత్యనారాయణస్వామి వ్రతము; 2 ఆదివారం ఉదయం 9.30లకు శతచ్ఛిద్ర రుద్రాభిషేకము; రాత్రి 6.30లకు తులసీ కళ్యాణం, అల్పాహారం; 3 సోమవారం ఉదయం 4లకు మహాన్యాసపూర్వక ఏకదశవార రుద్రాభిషేం, ఉదయం 7.30-10.30-12లకు, సాయంత్రం 5లకు ఏకవార రుద్రాభిషేకములు; 5 బుధవారం కార్తీకపౌర్ణమి సోమవారం ఉదయం 4లకు మహాన్యాసపూర్వక ఏకదశవార రుద్రాభిషేం, ఉదయం 7.30-9-10.30-12లకు, రాత్రి 7.00లకు జ్వాలాతోరణం (సంకల్పం), పుష్పాలంకరణ; 9 ఆదివారం ఆరుద్రనక్షత్రం ఉదయం 9.00లకు రుద్రహోమం, 12లకు వనభోజనములు; 10 సోమవారం ఉదయం 4లకు మహాన్యాసపూర్వక ఏకదశవార రుద్రాభిషేం, ఉదయం 7.30-9-10.30-12లకు, సాయంత్రం 5లకు ఏకవార రుద్రాభిషేకములు; 15 శనివారం సాయంత్రం 5లకు లక్ష బిల్వార్చన; 16 ఆదివారం ఉదయం 9లకు అన్నాభిషేకము; 17 చివరి సోమవారం ఉదయం 4లకు మహాన్యాసపూర్వక ఏకదశవార రుద్రాభిషేం, ఉదయం 7.30-9-10.30-12లకు, సాయంత్రం 5లకు ఏకవార రుద్రాభిషేకములు; 16 మంగళవారం మాసశివరాత్రి ఉదయం 4లకు మహాన్యాసపూర్వక ఏకదశవార రుద్రాభిషేకం, ఉదయం 7.30-9-10.30లకు, సాయంత్రం 5లకు ఏకవార రుద్రాభిషేకములు, రాత్రి 6.30లకు శివకళ్యాణ మహోత్సవం, అల్పాహారం; 20 గురువారం ఉదయం 9లకు సప్తవింశతి కలశాభిషేకము పూజాకార్యక్రమాలుంటాయని అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి ఆయా పూజాది కార్యక్రమాల్లో పాల్గొని ఆ పరమశివుని అనుగ్రహ పాత్రులు కావాలని పి.లక్ష్మారెడ్డి, బి.సి.వెంకటేశ్వరరావు, అర్చకులు కోరారు.

# నార్సింగిలో వైభవంగా 'సదర్' వేడుకలు

**- ఆడి,పాడిన సిఎం రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డి**



నార్సింగి సదర్ వేడుకలలో డప్పుల దరువుకు అనుగుణంగా స్టెప్పులు వేస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్‌రెడ్డి ,ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ దృశ్యం

**నార్సింగి, అక్టోబర్ 21 ప్రభాతవార్త :** రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం నార్సింగి గ్రామంలో వెలుగుల పండుగ దీపావళి రోజు మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ జి.వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన "సదర్" వేడుకలు వైభవంగా సాగాయి. పదుల సంఖ్యలో ప్రత్యేక శిక్షణ పొందిన దున్నలను హర్యానా, పంజాబ్, గుజరాత్ రాష్ట్రాల నుంచి తీసుకు వచ్చి అందంగా అలంకరించి, పూజలు చేసి, భారీ ఊరేగింపు నిర్వహించారు. దున్నలను ముందుకాళ్ల పైకి ఎత్తించి నృత్యాలు చేయించారు. ఊరేగింపులో జై యాదవ్... జైజై మాదవ్... అంటూ యాదవ సోదరులు నినదించారు. ఈ వేడుకలకు రాజేంద్రనగర్ శాసన సభ్యులు టి.ప్రకాశ్‌గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేసి యాదవ సోదరులు, యువకులను ఉర్రూతలూగించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సోదరుడు కొండల్‌రెడ్డి సైతం సదర్ వేడుకలలో ఉత్సాహంగా పాల్గొని డప్పుల దరువుకు అనుగుణంగా యువకులతో పోటీ పడి నృత్యాలు చేశారు. దీంతో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంతోషానందాలలో మునిగితేలారు. గత 15.సంవత్సరాలుగా నార్సింగిలో సదర్ వేడుకలను వెంకటేష్ యాదవ్ ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నారు. అలాగే కోకాపేట్‌లో చిక్కిరి బిక్షపతి యాదవ్ ఆధ్వర్యంలో సదర్ వేడుకలను అంగరంగవైభవంగా జరుపుకున్నారు. ఈ వేడుకల్లో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేష్ ముదిరాజ్, సీనియర్ నాయకులు సూర్యప్రకాశ్, మాజీ కౌన్సిలర్ అరుణజ్యోతి, కాంగ్రెస్ నాయకులు దశరత్ యాదవ్, హరిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

## గంగానగర్ బస్తీ దవాఖానను సందర్శించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



గోల్నాక డివిజన్ గంగానగర్ బస్తీ దవాఖానను సందర్శించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

**హైదరాబాద్ అక్టోబర్ 21 ప్రభాతవార్త:**

అంబర్‌పేట్ నియోజకవర్గ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మంగళవారం గోల్నాక డివిజన్ గంగానగర్ బస్తీ దవాఖానను సందర్శించారు. గత (బిఆర్ఎస్) ప్రభుత్వం ప్రజల ఆరోగ్య రక్షణ కోసం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన బస్తీ దవాఖానల పథకంను ప్రస్తుత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహించడం పట్ల ఎమ్మెల్యే తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం డాక్టర్లు , సిబ్బందికి కనీస వేతనాలు చెల్లించకపోవడం, అలాగే మందులు, ల్యాబ్ టెస్టులు మరియు అవసరమైన మౌలిక సదుపాయాలు అందించడంలో వైఫల్యం చెందడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలకు సమయానికి మరియు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే కోరారు. పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు కూడా పాల్గొన్నారు.

# సదర్ ..అదిరెన్







**హైదరాబాద్, అక్టోబరు 21 ప్రభాతవార్త**

దున్నపోతుల విన్యాసాలు..డప్పు చప్పుళ్లు, నృత్యాలు, ఆటపాటలతో దీపావళి సందర్ వేడుకల్ని సంబరంగా నిర్వహించారు. ఖైరతాబాద్‌లో మంగళవారం నవయుగ యాదవ సంఘం చౌదరి యాదయ్య యాదవ్ అండ్ బ్రదర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ ఉత్సవాలు వైభవంగా సాగాయి. అందంగా అలంకరించిన దున్నపోతులపై యాదవుల హాకీ స్టిక్‌లు పట్టుకొని నృత్యాలు చేస్తూ, తీన్మార్ స్టెప్పులు వేశారు. దాదాపు నాలుగైదు గంటలపాటు వాటి విన్యాసాలు వీక్షకులను అలరించాయి.సదర్ ఉత్సవాల్లో ఎంపి అనిల్‌కుమార్‌యాదవ్, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, మేయర్ గద్వాల విజయలక్ష్మీ, కార్పొరేటర్ పి.విజయారెడ్డి పాల్గొన్నారు.



బంజారా హిల్స్‌లో జరిగిన ఫ్యాషన్ షోలో పాల్గొన్న మోడల్స్

## రాజేంద్రనగర్‌లో ట్రాఫిక్ పరిస్థితిపై ఎసిపి పర్యవేక్షణ

**అత్తాపూర్ అక్టోబరు21,ప్రభాతవార్త :**

రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ పరిస్థితులను అధికారులు పర్యవేక్షించారు. ట్రాఫిక్ ఏసీపీ స్వయంగా ఆరంఘర్ జంక్షన్ల వద్ద ట్రాఫిక్‌ను పరిశీలించారు. ట్రాఫిక్ సాధారణంగా కొనసాగుతుండగా, పీక్ అవర్స్‌లో కూడా సమర్థవంతంగా నియంత్రణ చేపట్టాలన్నారు. ప్రయాణికులు లేన్ డిసిప్లిన్ పాటించి, ట్రాఫిక్ సిబ్బందికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## మామిడాకులు కోసేందుకు వెళ్లి కింద పడి వ్యక్తి మృతి

**ఉప్పల్, అక్టోబరు 21 ప్రభాతవార్త :**

దీపావళి పండుగ సందర్భంగా మామిడి ఆకులు కోసేందుకు వెళ్లి ఒక వ్యక్తి ప్రమాదవశాత్తు కింద పడి మృతి చెందిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రామంతాపూర్ ఆనంద్‌నగర్ కాలనీలో నివసించే నాసోళ్ల నరసింహా(50) వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. దీపావళి సందర్భంగా ఆదివారం ఉదయం మామిడి ఆకులు కోసేందుకు తన ఇంటి మూడో అంతస్తుకు వెళ్లి మామిడి ఆకులు తెంపుతుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడిపోయాడు. దీంతో అతని తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుని భార్య దుర్గ ఫిర్యాదు మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## భర్తతో గొడవపడి భార్య ఉరివేసుకుని ఆత్మహత్య

**ఉప్పల్, అక్టోబరు 21 ప్రభాతవార్త :**

భర్తతో గొడవపడి ఒక మహిళ ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామంతాపూర్ వెంకట్‌రెడ్డినగర్‌కు చెందిన ఉపేంద్ర భార్య స్వప్న(27)లకు తొమ్మిది సంవత్సరాల క్రితం పెళ్లి జరిగింది. అయితే గత కొద్ది రోజులుగా భార్యభర్తల మధ్య కుటుంబ సమస్యలు ఉన్నాయి. ఇదే క్రమంలో ఆదివారం రాత్రి 1.30 గంటల సమయంలో ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వెంటనే భర్త చూసి ఆసుపత్రికి తీసుకుని వెళ్లే లోగా ఆమె మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతురాలి సోదరులు వినోద్‌చారి ఫిర్యాదు మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

**ఉప్పల్, అక్టోబరు 21 ప్రభాతవార్త :**

ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలతో ఒక వ్యక్తి ఉరివేసకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామంతాపూర్ గణేష్‌నగర్‌కు చెందిన మట్టెవాడ మురళీమోహన్(47) ప్రైవేటు ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. అయితే గత కొద్ది రోజులుగా ఆయన భార్య ఆరోగ్య బాగలేక ఇబ్బంది పడుతున్నాడు. ఇదే క్రమంలో అర్థిక సమస్యలు కూడా ఉన్నట్లు తెలిపారు. దీంతో ఈనెల 19వ తేదిన ఇంట్లో అందరూ పడుకున్న తర్వాత ఇంట్లో ప్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. అర్థిక ఇబ్బందులు, అనారోగ్య సమస్యలతోనే అత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## యువకుడు ఆత్మహత్య

**అత్తాపూర్ అక్టోబరు21,ప్రభాతవార్త :**

ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన అత్తాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు వివరాల ప్రకారం....అత్తాపూర్ పరిధిలోని పాండురంగ నగర్‌లో నివాసం ఉండే సంజయ్ కుమార్ (23) ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు.సమాచారం రావడంతో ఘటన స్థలానికి చేరుకొని పూర్తి వివరాలు సేకరించడం జరిగిందని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ర్యాంప్‌లో ట్రాఫిక్ నియంత్రణ..

**అత్తాపూర్ అక్టోబరు21,ప్రభాతవార్త :**

శివరాంపల్లి ర్యాంప్‌లో వాహనాల గమనాన్ని సమగ్రంగా ట్రాఫిక్ పోలీసులు పరిశీలించారు. పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ వే ఆరాంఘర్ వైపు డౌన్ ర్యాంప్‌లో రియల్‌టైమ్ ట్రాఫిక్ డేటా సేకరించి, వాహనాల ప్రవాహాన్ని అంచనా వేశారు. ఆరాంఘర్ జంక్షన్‌లో రైట్ టర్న్, యూటర్న్ వాహనాల సంఖ్య, అండర్ పాస్ వినియోగం, శంషాబాద్ వైపు రైట్ టర్న్, బహదూర్‌పురా వైపు లెఫ్ట్ టర్న్ వాహనాల గణన చేశారు. ట్రాఫిక్ సజావుగా వెళ్లేందుకు సర్వే చేశారు.

## భారత ఆర్షసంస్కృతి ప్రపంచానికి ఆదర్శం

**: ఇన్‌కంటాక్స్ మాజీ చీఫ్ కమిషనర్ నరసింహప్ప**



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నరసింహప్ప, బిక్కికృష్ణ, భువనేశ్వరి, మునిరత్నంనాయుడు, రవిశంకర్ తదితర అతిథులు

**రవీంద్రభారతి, అక్టోబరు 21 ప్రభాతవార్త :** భారతీయ ఆర్షధర్మం యావత్ ప్రపంచానికే ఆదర్శమని ఆదాయపన్ను శాఖ మాజీ చీఫ్ కమిషనర్ ఎం.నరసింహప్ప అన్నారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్ ఆధ్వర్యంలో దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో ప్రముఖకవి డా. బిక్కి కృష్ణ సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎం.నరసింహప్ప విశిష్ట అతిథులు పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం ఉపాధ్యక్షుడు ఆచార్య డి.మునిరత్నం నాయుడు, తెలుగువన్ వ్యవస్థాపకుడు కె.రవిశంకర్, ఆంధ్రప్రభ సంపాదకుడు వై.ఎస్.ఆర్.శర్మ, ప్రముఖ కవులు డా. వి.డి.రాజగోపాల్, డా. జెల్ది విద్యాధర్, డా. పి.విజయలక్ష్మిపండిట్, రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి, డా. రాధాకుసుమ, పద్మశ్రీలత, రచయిత్రి ఎం.భువనేశ్వరి తదితరులతో కలిసి రచయిత్రి మారేపల్లి భువనేశ్వరి రచించిన విశ్వానికి తల్లి శ్రీ ఆయుర్దేవి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ పుస్తకం భువనేశ్వరి చేసిన గొప్ప పరిశోధనకు మచ్చుతునక అని అభివర్ణించి ఎంతగానో ప్రశంసించారు. ఈ సందర్భంగా డా, సుభాష్‌బాలు, వాసిలి వసంత్‌కుమార్, డా. రామడుగు నరసింహాచార్యులు, డా. అరికపూడి రఘులకు అతిథుల చేతులమీదుగా జాతీయ జీవనసాఫల్య పురస్కారాలు, మరో 30మందికి జాతీయ లెజండరీ పురస్కారాలు ప్రదానం చేసి శుభాభినందనలు తెలిపారు. అనంతరం డా.రాధాకుసుమ, పద్మశ్రీలతలు పుస్తక సమీక్ష కావించగా 40మంది కవులు తమ కవితాగానం చేశారు. చివరిగా రచయిత్రి ఎం.భువనేశ్వరిని ఘనంగా సత్కరించారు.

### డ్రైనేజీల నిర్మాణానికి నిధులు కేటాయించాలి : ఎమ్మెల్యే శ్రీగణేష్



కంటోన్మెంట్ బోర్డు సిఈఓ మధుకర్ నాయక్‌తో బేటీ అయిన ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్,అక్టోబర్ 21 ప్రభాతవార్త:** ఎలివేటెడ్ కార్మిడార్ నిర్మాణంలో రక్షణ శాఖ స్థలాలపై వచ్చిన రూ.303 కోట్ల నిధులను నాలాలు, డ్రైనేజీల నిర్మాణానికి ప్రజల సూచనల మేరకు కెటాయించాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ బోర్డు సిఈఓకు సూచించారు. మంగళవారం బోర్డు సిఈఓతో ఎమ్మెల్యే శ్రీగణేష్ బేటీ అయ్యారు. కంటోన్మెంట్ చరిత్రలో ఇంత బారీ ఎత్తున నిధులు బోర్డు నిధికి రావడం సంతోషకరమన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని బోర్డు ప్రాంతాల అభివృద్ధికి కెటాయించాలన్నారు. అదే విధంగా బుధవారం కంటోన్మెం ట్ కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం హెచ్ఎండిఏ జలమండలి అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు.

**డిఈఓ దినేశ్‌రెడ్డితో సమావేశమైన ఎమ్మెల్యే . ..**

తిరుమగిరిలో ఉన్న బి 1 స్థలాల్లోని 4.71 ఎకరాల భూమిని క్రిస్టియన్ సెమిట్రీకి కెటాయించాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ రక్షణ శాఖ డిఈఓ దినేశ్‌రెడ్డికి సూచించారు. ఈ స్థలాన్ని భూ బదలాయింపు కింద కెటాయించాలని విజ్ఞప్తి చేశారు.

### రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి : గజ్జెల నాగేశ్



5వ వార్డు సంజీవయ్య నగర్‌లో బస్తీ దావఖానను తనిఖీ చేస్తున్న గజ్జెల నాగేశ్ తదితరులు

**కంటోన్మెంట్,అక్టోబర్ 21 ప్రభాతవార్త:** నగరంలోని వివిధ మురికివాడల్లో నివాసం ఉంటున్న నిరుపేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన బస్తీ బస్తీ దావఖానాల్లో రోగులకు సరిపడే మందులను, డయాగ్నస్టిక్ కేంద్రాలను ఏర్పాటు చేసిన పలు వైద్య పరీక్షలు నిర్వహించాలని బేవరేజెస్ కార్పోరేషన్ చైర్మన్, తెలంగణ ఉద్యమ నేత గజ్జెల నాగేశ్ సూచించారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు మంగళవారం కంటోన్మెంట్ 5వ వార్డు సంజీవయ్య నగర్‌లోని బస్తీ దావఖానను తనిఖీ చేసి రోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా రోగులు, గర్భిణీ స్త్రీలు, చిన్న పిల్లలకు వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లతో పాటు ఆశా వర్కర్లకు జీత భత్యాలు, వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులనుఅడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు రావుల సతీష్, పనస సంతోష్, శ్రీనివాస్, యాదగిరి, సంతోష్, రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## బస్తీ దవాఖాన పరిశీలన...



బస్తీ దవఖానాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబర్ 21 ప్రభాతవార్త :** కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని మూసాపేట్ జనతానగర్‌లోని బస్తీ దవాఖానాను మంగళవారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పరిశీలించారు. బస్తీ దవాఖానాలో ప్రజలకు కావాల్సిన మందులు అందుబాటులో లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే ఉద్యోగులకు జీతాలు కూడా సక్రమంగా అందడం లేదని, వెంటనే ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో కావాల్సినవి అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా గత ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు అందుబాటులోకి బస్తీ దవఖానాలు తీసుకొచ్చారని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కనీస మౌలిక సదుపాయాలు కూడా లేకుండా గాలికి వదిలేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలపై ఉన్న చిత్తశుద్ధి ఏంటో కళ్ళకు కట్టినట్లు కనబడుతుందని ఇప్పటికైనా మేల్కొని నిరుపేదలకు ఉపయోగపడే బస్తీ దవాఖానాలు విషయంలో సరైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పగుడాల శిరీష బాబురావు, మాజీ కార్పొరేటర్ తూము శ్రవణ్ కుమార్, పగుడాల బాబురావు, అధ్యక్షులు ప్రభాకర్ గౌడ్, అంబటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బేగంపేటలో బహిరంగంగా మందేస్తున్నారు

**-ఎక్కడ చూసినా మద్యం బాటిల్స్. ఖాళీ గ్లాసులు.**

**-పాఠశాలలు,పబ్లిక్ ప్లేసుల్లో ఇదేం పని అంటూ విద్యార్థుల తల్లిదండ్రులు. గగ్గోలు**



ఓల్డ్ కస్టమ్స్ బస్తీ బ్రిడ్జి కింద పబ్లిగ్గా మందుతాగుతున్న మందుబాబులు.

**బేగంపేట అక్టోబరు 21,ప్రభాతవార్త**

బేగంపేటలో ఎక్కడ పడితే అక్కడ పబ్లిగ్గా మందేస్తున్నా పోలీసులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తుంది. ముఖ్యమంత్రి,వివిఐపీలు ప్రయాణించే బేగంపేట ప్రధాన రోడ్డులోని ఓ ప్రయివేటు పాఠశాల ముందు ఉన్న ఫుట్‌ఫాత్ తో పాటు ఓల్డ్‌కస్టమ్స్ బస్తీ బ్రిడ్జి కింద ఐదు రూపాయల భోజన కేంద్రం ముందు మందు బాబులు పబ్లిగ్గా మద్యం సేవిస్తుండటం విద్యార్థుల తల్లి దండ్రులతో పాటు స్థానికులు,మహిళా ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.పబ్లిగ్గా మందుబాబులు ప్రధాన రోడ్డుపైనే మద్యం సేవిస్తూ పరిసరాలను అపరిశుభ్రం చేయడం తో పాటు ఇబ్బందులు సృష్టిస్తుండటంపై పోలీసులపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలో రైల్వేస్టేషన్, జీహెచ్ఎంసీ నైట్ షెల్టర్ ఉంది.ఇక్కడే ఐదు రూపాయల భోజన కేంద్రం ఉంది.ఈ ప్రాంతంలోనే పట్ట పగలే మందుబాబులు మద్యం సేవిస్తుండటం స్థానికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తుంది.అలాగే ప్రధాన రోడ్డుపైన ఉన్న హైదరాబాద్ పబ్లిక్ స్కూలు ముందు ఉన్న ఫుట్‌ఫాత్ పైన ఉదయం పది గంటల నుంచి రాత్రి వరకు మందుబాబులు మద్యం సేవిస్తుండటంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.ఇక్కడే ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఫుట్‌ఫాత్ కూడా ఉంది.ఉదయం కళాశాలకు వెళ్లి సాయంత్రం ఇళ్లకు వెళ్లే సమయంలో మందు బాబులు ఫుట్‌ఫాత్‌లపై మందేస్తుండటంతో విద్యార్థినులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.ప్రధాన రోడ్డు వెంటే ఈ తతంగం జరుగుతున్నా కనీసం పోలీసులు పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి.అదే విధంగా ఆనంద్ థియేటర్ ముందు బస్ షెల్టర్లను కూడా మందు బాబులు వినియోగించుకుంటూ అక్కడే మద్యం సేవిస్తుండటంతో ప్రయాణీకులు బస్టాండ్‌లో కూర్చోకుండా బస్సుల కోసం రోడ్డుపైనే నిలబడి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.ఇక సాయంత్రం అయిందంటే చాలు బేగంపేట నుంచి ఫతేనగర్ లింక్ రోడ్డు లో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ ,ధనియాల గుట్ట శ్మశాన వాటిక రోడ్డుపైన మందు బాబులు చేస్తున్న హంగామాతో స్థానికులు,ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.అలాగే మాతాజీనగర్ లో ఉన్న ఖాళీ స్థలంతో పాటు ప్రకాశంనగర్,పాటిగడ్డ,పాటిగడ్డ రైల్వేస్టేషన్,మోడల్ మార్కెట్, పాటిగడ్డ ఆర్ అండ్ బి క్వార్టర్స్ తదితర ప్రాంతాల్లో మందు బాబులు హల్చల్ చేస్తున్నారని,స్థానికులు ఆరోపిస్తున్నారు.ఇప్పటికైనా పోలీసులు ఆ దిశగా ఎలాంటి ముందస్తు రక్షణ చర్యలు చేపడతారో లేదో వేచి చూడాలి.

### దీపావళి అమావాస్య పవిత్రమైన దినం: జంపనప్రతాప్



1వ వార్డు బాపూజీ నగర్‌లో అన్నదానం చేస్తున్న జంపనప్రతాప్ తదితరులు

**కంటోన్మెంట్,అక్టోబర్ 21 ప్రభాతవార్త:** దీపావళి అమావాస్య పవిత్రమైన దినమని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. దీపావళి అమావాస్యను పురస్కరించుకొని మంగళవారం బోయిన్‌పల్లి బాపూజీ నగర్ శ్రీదేవి నల్లపోచమ్మ ఆలయంలో మర్రి పుష్పల్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అదే విధంగా చిన్నతోకట్ట, కట్ట మైసమ్మ ఆలయంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామారావు, నరేందర్, అజిత్,నర్సింహ్మా, ప్రేమ్ ముదిరాజ్, శ్రీకాంత్, దుర్గయ్య, కట్ట మైసమ్మ ఆలయ నిర్వాహకులు జాజుల క్రాంతి, సాయి, అరుణ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### కంటోన్మెంట్‌లో సిఈఓ మధుకర్ సేవలు మరువలేనివి : జంపనప్రతాప్



సిఈఓ మధుకర్ నాయక్‌కు అభినందనలు తెలుపుతున్న జంపనప్రతాప్

**కంటోన్మెంట్,అక్టోబర్ 21 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ బోర్డు సిఈఓగా మూడు సంవత్సరాల పాటు విధులు నిర్వహించి ప్రజలకు,బోర్డు అభివృద్ధికి ఎంతో కృషి చేశారని బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ తెలిపారు. పదోన్నతిపై మధుకర్ నాయక్ ఢిల్లీకి బదిలీ అవుతున్న సందర్భంగా మంగళవారం ఆయను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా నూతన సిఈఓ అరవింద్ కుమార్ ద్వివేది, డిఈఓ దినేశ్‌రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకాశ్ బాటియా, షకీబ్ హుస్సెన్, రమేశ్, నర్సింహ్మా పాల్గొన్నారు.

### కట్ట మైసమ్మ ఆలయంలో అన్నదానం

**కంటోన్మెంట్,అక్టోబర్ 21 ప్రభాతవార్త:** అమావాస్యను పురస్కరించుకొని బోయిన్‌పల్లి కట్ట మైసమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు జాజుల క్రాంతి, సాయి, నాయకులు దేవులపల్లి శ్రీను, ఓం ప్రకాశ్ పవన్, నర్సింహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### అనాధల బాలలతో దీపావళి వేడుకలు జరుపుకోవడం సంతోషం : ఏసిపి



బోయిన్‌పల్లిలో అనాధ బాలలతో దీపావళి వేడుకల్లో పాల్గొన్న ఏసిపి గోపాల క్రిష్ణమూర్తి

**కంటోన్మెంట్,అక్టోబర్ 21 ప్రభాతవార్త:** అనాథలు, వీధి బాలలతో దీపావళి వేడుకలు జరుపుకోవడం సంతోషకంగా ఉందని బేగంపేట ఏసిపి గోపాలక్రిష్ణమూర్తి తెలిపారు. దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం బోయిన్‌పల్లిలోని తెలంగాణ గార్డెన్‌లో నిర్వహించిన తారాహోం అనాథలు, వీధి బాలలతో ఆయన దీపావళి వేడుకలు జరుపుకొని చిన్నారులతో టపాసులు కాల్పించి స్వీట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

### పోలీస్ అమర వీరులకు ఘనంగా నివాళులు



ఉమేశ్ చంద్ర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న తండ్రి,కుటుంబ సభ్యులు, ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి

**సంజవరెడ్డి నగర్,అక్టోబర్ 21 ప్రభాతవార్త:** శాంతి భద్రతల పరిరక్షణ కోసం విధి నిర్వాహనలో అసువులు బాసిన పోలీస్ అమర వీరులను స్మరించుకుంటూ ఎస్. ఆర్.నగర్‌లోని అమరుడైన ఉమేశ్ చంద్ర విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన ఎస్. ఆర్. నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి. ఈ కార్యక్రమంలో ఉమేశ్ చంద్ర తండ్రి వేణుగోపాల్ రావు తదితరుల పాల్గొన్నారు.

### సనత్ నగర్ పోలీస్‌స్టేషన్‌లో

**సంజవరెడ్డి నగర్,అక్టోబర్ 21 ప్రభాతవార్త:** పోలీస్ అమర వీరుల సంస్మరణ దినం సందర్భంగా సనత్ నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఘనంగా నివాళులర్పించిన సనత్ నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు,సనత్ నగర్ పోలీస్ సిబ్బంది. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌లు మాట్లాడుతూ కర్తవ్యమే ఊపిరిగా విధి నిర్వాహనలో అసువులు బాసిన పోలీస్ అమర వీరులను స్మరించుకుంటూ అక్టోబర్ 21 నాడు పోలీసుల అమర వీరుల దీనం జరుపుకుంటున్నామన్నారు.సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సనత్ నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌లతో పా టు సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఏఎస్ఐలు, పాల్గొన్నారు.



అమరులకు పూలతో నివాళులర్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌లు

### ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపిన లింగాని ప్రసన్న



ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌కు దీపావళి శుభాకాంక్షలు తెలుపుతున్న కార్పోరేటర్ లింగాని ప్రసన్న

**అడ్డగుట్ట,అక్టోబర్ 21 ప్రభాతవార్త:** దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్‌కు అడ్డగుట్ట డివిజన్ కార్పోరేటర్ లింగాని ప్రసన్న మర్యాదపూర్వకంగా కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకుడు లింగాని శ్రీనివాస్ తదితరులు

### పోలీసు అమరవీరుల దినోత్సవం



పోలీసు అమరవీరులకు నివాళ్లు అర్పించిన బిజెపి నాయకులు డి.గోపాల్‌జీ

**బేగంబజార్,అక్టోబర్ 21 ప్రభాతవార్త:** సమాజంలోని ప్రజల ధన,మాన ప్రాణాలను కాపాడటం అహర్నిలు కృషి చేస్తున్నారని తెలంగాణ బిజెపి కేంద్ర వ్యవసాయశాఖ సభ్యులు డి.గోపాల్‌జీ అన్నారు.పోలీసుల అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గోషామహల్ పోలీస్ గ్రౌండ్‌లోని అమరవీరుల స్థూపం వద్ద నివాళ్లు ఆర్పించారు.ఈసందర్భంగా ఆయన సమాజంలో పోలీసులు కూడా పౌరులన్నారు.విధినిర్వహణలో ప్రాణాలను ఆర్పించిన పోలీసులకు ప్రజలు ఎప్పుడు రుణపడి ఉంటారన్నారు.ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.



దీపావళి పండుగను పురస్కరించుకుని తెలంగాణ భజరంగ్‌సేనా రాష్ట్ర అధ్యక్షులు ఎన్.ఆర్.లక్ష్మన్‌రావుగుప్త కుటుంబసభ్యులతో కలిసి సేనా కార్యాలయంలో లక్ష్మిదేవత పూజలు చేస్తున్న దృశ్యం

## దేశభక్తిగీతాలు జాతీయ భావనలను పెంచుతాయి

**-సిబిఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వి.వి.లక్ష్మీనారాయణ**




బహుమతి గ్రహీతలతో జెడి లక్ష్మీనారాయణ, కె.రామాచారి, నాగశేఖర్‌గుప్తా తదితర అతిథులు దేశభక్తి గీతాలను ఆలపిస్తున్న కళాకారులు

**నాంపల్లి, అక్టోబరు 21 ప్రభాతవార్త :** దేశభక్తి గీతాలు అందరిలో ఏకత్వం, జాతీయ భావనలను పెంపొందింపజేస్తాయని సిబిసి మాజీ జాయింట్ డైరెక్టర్ వి.వి.లక్ష్మీనారాయణ అన్నారు. అటువంటి గీతాల ఆలాపనతో ప్రాంతీయ నేషనల్ గ్రూప్ సాంగ్ పాటల రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించి ప్రోత్సహిస్తున్న తెలంగాణ ప్రాంత భారత వికాస్ పరిషత్ సేవలను ఆయన ఎంతగానో అభినందించారు. భావ, రాగ, తాళ సమన్వయమే బృందగానమనే భావాన్ని అవగాహన చేసుకుని పాడాలని సూచించారు. పరిషత్తు అధ్యక్షుడు నాగశేఖర్‌గుప్తా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జెడి లక్ష్మీనారాయణ విశిష్ట అతిథులు లిటిల్ మ్యూజిషియన్స్ అకాడమీ అధ్యక్షుడు, ప్రముఖ గాయకుడు, సంగీత దర్శకుడు డా. కె.రామాచారి, వివేకానంద సేవాసమితి అధ్యక్షుడు జల్వేందర్‌రావు, సంస్థ పూర్వాధ్యక్షుడు కె.ఎస్. ఆర్.ప్రసాద్, సాధన నరసింహాచార్య, సదాశివరెడ్డి, శివరామకృష్ణ, ఇ.డి.నాగరాజు తదితరులు పాల్గొని ప్రసంగించగా ప్రముఖ గాయకుడు టి.శరత్‌చంద్ర, సంస్థ ఉపాధ్యక్షుడు ఫణికుమార్, హరిప్రసాద్, అశోక్, యోగానంద్‌లతో కలిసి పోటీల్లో విజేతలకు సన్మానించి బహుమతులను ప్రదానం చేసి శుభాభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ 16శాఖల నుండి ఎంపికైన టీమ్స్ హిందీ, సంస్కృతం, ప్రాంతీయ భాష, జానపద గీతాలను ఆలపించి ఆహుతులను దేశభక్తిమార్గంలో పయనింపజేశారు.

## జాతీయ స్థాయి పోటీలకు నిజాంపేట క్రీడాకారుల ఎంపిక

**నిజాంపేట్, అక్టోబర్ 21, ప్రభాతవార్త**

తెలంగాణ రోలర్ స్కెటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సరూర్ నగర్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా, రాష్ట్ర స్థాయి స్కెటింగ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఆర్ జె ఇన్స్టిట్యూట్ ఆఫ్ స్కేటింగ్ నిజాంపేటకు చెందిన 7 గురు క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎంపిక అయినట్టు కోచ్ పెరుమాండ్ల రాజేష్ తెలిపారు. ఆర్ జె ఇన్స్టిట్యూట్ ఆఫ్ స్కేటింగ్‌లో శిక్షణ పొందిన వంగ మోక్ష శ్రీ, నిరుక్త 10 నుంచి 12 సంవత్సరాల విభాగంలో 200 మీటర్ల పోటీలో సిల్వర్, 1000 మీటర్ల పోటీలో బ్రౌన్ మెడల్ సాధించింది. వైదిక్ శనిగరపు 1000 మీటర్ల విభాగంలో బ్రౌన్ మెడల్ సాధించింది. 6నుంచి 8 సంవత్సరాల విభాగంలో చెర్విక్ రెడ్డి వెల్లపాలెం 2 లాప్స్ సిల్వర్ 3 లాప్స్ గోల్డ్ మెడల్ సాధించారు. టి. తారక్ దీప్ రెడ్డి 6నుంచి 8 సంవత్సరాల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించారు. పూర్ణ అద్విక 3 లాప్స్, 500+డి మెడల్స్ సాధించారు. కక్కర సుదీక్ష చౌదరి 1 రింక్‌లో గోల్డ్, 2 రింక్‌లో బ్రౌన్ మెడల్ సాధించింది. ఆర్య ధృతి 4 నుంచి 6 సంవత్సరాల విభాగంలో 200 మీటర్ల పోటీలో సిల్వర్, 300 మీటర్ల పోటీలో సిల్వర్ సాధించింది. వీరితోపాటు జిల్లా స్థాయిలో 23 మంది క్రీడాకారులు, రాష్ట్ర స్థాయి 7మంది క్రీడాకారులు మెడల్స్ సాధించినట్టు కోచ్ రాజేష్ తెలిపారు. ఈ సందర్భంగా కోచ్ రాజేష్ మాట్లాడుతూ తమకు సరైన రింక్ సౌకర్యం లేకున్న ఉన్న సౌకర్యాలను వాడుకుని ఉత్తమ ప్రతిభ కనబరుచుతున్నామన్నారు. ప్రభుత్వం స్పందించి అన్ని వసతులతో కూడిన రింక్ సౌకర్యం కల్పిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి దేశానికి పేరు తీసుకువచ్చే స్థాయి క్రీడాకారులను అందిస్తామన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించడంతోపాటు మెరుగైన సౌకర్యాలతో కూడిన రింక్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని రాజేష్ కోరారు.



క్రీడాకారులతో కోచ్ రాజేష్

## చిన్నారులతో టిపిసిసి అధ్యక్షులు దీపావళి వేడుకలు

**-దేవనార్ పాఠశాల విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించడం సంతోషం : మహేష్‌కుమార్‌గౌడ్**



దేవనార్ అంధుల పాఠశాలలో దీపావళి వేడుకలలో పాల్గొన్న టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్.

**బేగంపేట అక్టోబరు 21,ప్రభాతవార్త**

దేవానార్ అంధుల పాఠశాల విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించడం ఎంతో సంతోషంగా ఉందని టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు.దీపావళి పండుగ సందర్భంగా ఆయన బేగంపేట అల్లంతోట బాయి లోని దేవనార్ అంధుల పాఠశాలలో మహేష్‌కుమార్ గౌడ్ విద్యార్థులతో కల్సి పటాకులు కాల్చి,స్వీట్లు పంచి దీపావళి వేడుకలలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ దేవనార్ అంధుల పాఠశాలను స్థాపించిన ఫౌండర్ చైర్మన్ సాయిబాబాగౌడ్ మార్గదర్శకంగా నిలిచారన్నారు.ఇక్కడ విద్య నేర్చుకున్న విద్యార్థులు ఇతరులతో సమానంగా నేడు రాష్ట్రంతో పాటు వివిధ రాష్ట్రాలు,దేశ విదేశాల్లో వివిధ రంగాల్లో తమ ప్రతిభను ప్రదర్శించడం గొప్ప విషయమన్నారు.వారితో పాటు దీపావళి వేడుకలు జరుపుకోవడం తన కెంతో సంతోషాన్ని కల్గించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండర్ చైర్మన్ సాయిబాబాగౌడ్, కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్,కాంగ్రెస్ సీనియర్ నాయకులు గౌరపల్లి రమేష్, హాజీటోచర్,విశాల్‌సుధాం,రామగళ్ల రమా దేవి,నసీరుద్దీన (అడ్డూ),కార్యకర్తలు,విధ్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను పరిష్కరిస్తా

**గన్‌ఫౌండ్రి,అక్టోబర్ 21ప్రభాతవార్త:** ప్రజా సమస్యలను పరిష్కరిస్తు,నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందని గన్‌ఫౌండ్రి డివిజన్ బిజెపికార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓం ప్రకాష్‌బిస్వా అన్నారు. బొగ్గులకుంటలోని అభివృద్ధి పనులతోపాటు సిసి రోడ్డు పనులకు శంఖుస్థాపన చేశారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్‌లోని పలు అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందన్నారు.ఈకార్యక్రమంలో బిజెపి నాయకులు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

### ఈ నెల 26న దసరా మిలాప్

**సైఫాబాద్, అక్టోబరు 21 ప్రభాతవార్త:** అరుంధతీయ బంధు సేవా మండలి 43వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 26వ తేదీన కాచిగూడలోని మున్నూరు కాపు భవనంలో 'దసరా మిలాప్' ఉత్సవాన్ని నిర్వహిస్తున్నామని మండలి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.ఈశ్వర్, దానగల్ల పవన్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధులుగా రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ, అడ్లూరి లక్ష్మణ్, కేంద్ర మాజీ మంత్రి సర్వే సత్యనారాయణ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షుడు, పద్మశ్రీ మంద కృష్ణమాదిగ తదితరులు పాల్గొంటారని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు చెప్పారు.

### గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ కార్యాలయంలో దీపావళి వేడుకలు



గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ కార్యాలయంలో దీపావళి వేడుకలు నిర్వాహించిన దృశ్యం

**చిక్కడపల్లి అక్టోబర్ 21 ప్రభాతవార్త:** దీపావళి పండుగ సందర్భంగా గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్ కుమార్ కార్యాలయంలో బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ శ్రీ ఎ.వినయ్ కుమార్‌తో కలిసి టపాసులు కాల్చి దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు.దీపాల వెలుగు ప్రజల జీవితాల్లోని చీకట్లను పారద్రోలి సుఖసంతోషాలు వెలుగులు నింపాలని కోరుకుంటూ,గాంధీనగర్ డివిజన్ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.









**PUBLIC NOTICE**

It is hereby informed that our clients 1. SRI. G VIJAY PRAKASH, S/o. M Gopi Kishan Upadyay, aged about 42, years, Occ: Business, 2. SRI AJAY PRAKASH UPADHYAYA, S/o. M Gopi Kishan Upadhyay, aged about 39 years, Occ: Business,Both are R/o. H.No.1-3-161, Kalasiguda, Secunderabad, Telangana-500003, have entered into an Agreement of sale to purchase all that Part Portion (Southern Side) House bearing No. 3-6-100/B (Old No.3-6-100), in Survey No.47/8, Land admeasuring 80.5. Sq. Yards., Out of 241.5 Sq. Yards., onGround Floor, along with Built Up / Plinth area 851 Sq.Ft., Out of 2554 Sq.Ft., alongwith Open Terrace rights above the First Floor and subsequent floors thereon situated atBoosareddyguda, Marredpally, Secunderabad Cantonment, Telangana, UniqueProperty ID: PT-CB-SECU-2021-07-19-195875, And bounded as follows. **NORTH** : REMAINING PORTION OF VENDORS BUILDING. **SOUTH** : COMMON PASSAGE. **EAST** : ROAD. **WEST** : NEIGHBOUR'S HOUSE, from 1. SRI. M.J. VASANTH KUMAR also known as VASANTH KUMAR M. J, S/o. M. V. Jeshwanth Rao, aged about 65 Years, Occ: Retired, R/o. H. No. 3-39-44, West Maredpally, Secunderabad, Telangana-500026,. 2. SMT. MADHURI MANNEY, W/o. Vasanth Kumar M.J., aged about 59 Years, Occ: House Wife, R/o. Villa No.6, Bhavyas Alankrita Meadows, Gunrock Road, Tirumalgherry, Secunderabad, Telangana-500015,and our clients have paid substantial amount.

If any Banks, Financial Institutions, persons, private sectors has got any objection against the said transaction they may put forth their objections before the undersigned along with the documentary proof Immediate after date of the publication. If objections are not received our clients will finalize the deal and the objections raised thereafter will not be entertained.

**L.SRINIVAS RAO**
**S. DINESH KUMAR**
**P. SRAVANTHI**
**ADVOCATES**
OFFICE: 6-5-519, New Bhoiguda, Secunderabad - 500 003
**Ph: 9848996020**

**IN THE COURT OF THE HON'BLE III SENIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, AT: SECUNDERABAD.**
**O.S.No. 420 OF 2025**

BETWEEN: -
**K. R. Padmavathi and Others** ...Plaintiffs
**AND**
**1. The Tahsildar,** Marredpally Mandal, Secunderabad.
**2. All Concerned** ...Defendants

To,
**All Concerned (D2)**

Please take notice that the Plaintiffs herein has filed the above Suit for declaration of Plaintiff's as legal heirs of deceased Kothapally Ramakrishna, who died intestate on 27.05.2025 in respect of the Suit Schedule Property. The above Said case is posted to **24.11.2025** at 10.30 am. In the above Court, If anybody is having any claim or objection may approach this Hon'ble Court with valid documents, either in person or through an Advocate, failing which the case will be heard and decided on merits in your absence.

**( By order of the Hon'ble Court )**

Sd/- **M/s. V. SRIKANTH, K. ROHIT,** Advocates,
H.No.2-10-6/61, Rukmini Enclave, Bollarum, Alwal Mandal, Medchal-Malkajgiri District.

## నేరాలను అదుపు చేయడంలో సిసి కెమెరాలు దోహదం : ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి


లోగోను ఆవిష్కరిస్తున్న సిఐ సైదిరెడ్డి, రాజారెడ్డి తదితరులు

**హుడా కాంప్లెక్స్, అక్టోబర్ 21 ప్రభాతవార్త:** నేరాలను అదుపుచేయడంలో సి సి కెమెరాలు ఎంతగానో దోహద పడతాయని సరూర్ నగర్ ఇన్స్పెక్టర్ సైదిరెడ్డి పేర్కొన్నారు. సరూర్ నగర్ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీ రోడ్ నెంబర్ 7 లో ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు మునగాల నరేష్ ఆధ్వర్యంలో ఎర్పాటు చేసిన సి సీ కెమెరాలను అయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ కాలనీ లో సి సీ కెమెరాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా కాలనీ సోవోనీర్ లోగోను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథి రాజారెడ్డి , సబ్ ఇన్స్పెక్టర్ మహేందర్, కాలనీ అధ్యక్షుడు గండు ధనం రెడ్డి, కార్యదర్శి కనక రావు, కోశాధికారి సాయి కిరణ్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ రావు, శాంతి ప్రసాద్, విజయ్ కుమార్, శ్రీనివాస్ గౌడ్, దాసరి సత్యనారాయణ రెడ్డి, తులసీ కృష్ణమూర్తి, బలరాజ్ గుప్తా, బొక్క సత్యనారాయణ రెడ్డి, కుసుం, హేమంత్ కుమార్, అనిల్, గీత, ప్రభాకర్ గౌడ్, విజయ్, సుధాకర చారి, వెంకటేష్ , కిరణ్ యాదవ్, చెన్న అనిల్, వంశీ, కార్తీక్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

## పండుగలు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయి

**: మాజీ డైరెక్టర్ వంజరి ప్రవీణ్ కుమార్**


దీపావళి పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వంజరి ప్రవీణ్ కుమార్, చిత్రంలో చేగురి వెంకటరమణ, మాదారం కృష్ణ, పాండు తదితరులు

**మలక్ పేట ,అక్టోబర్ 21, ప్రభాతవార్త:** పండుగలు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, ప్రముఖ వ్యాపారవేత్త వంజరి ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. దీపావళి పర్వదినం సందర్భంగా మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్లో ఆయన ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగలు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి ఉత్సవాలలో ప్రశాంతంగా జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ చాంబర్ ఆఫ్ అగ్రి ట్రేడర్స్ అధ్యక్షుడు వెంకటరమణ, హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాదారం కృష్ణ, వ్యాపారవేత్తలు పాండు, నరేష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

**-మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి**


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి , వంజరి వినోద్ కుమార్, కొట్ల శ్రీనివాస్ తదితరులు

**మలక్ పేట ,అక్టోబర్ 21, ప్రభాతవార్త:** ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. మలక్ పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్లో దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మిర్చి అసోసియేషన్ అధ్యక్షుడు, ప్రముఖ వ్యాపారవేత్త వంజరి వినోద్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగలు ప్రజల మధ్య ఐక్యతను పెంపొందిస్తాయని తెలిపారు. పండుగలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిరూపాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్, టిపీసీసీ ప్రధాన కార్యదర్శి బొల్లు కిషన్, మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్ జి, సం రెడ్డి సురేందర్ రెడ్డి, నాయకులు ధర్పల్లి అశోక్, జిట్టా సురేందర్ రెడ్డి, తెల్లా మహేష్ కుమార్, శ్రీధర్ రెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

**- డైరెక్టర్ మస్రత్ సుల్తానా**


ఏఐసిసి పరిశీలకులు అమీన్ పటేల్ ను సన్మానిస్తున్న మార్కెట్ కమిటీ డైరెక్టర్ మస్రత్ సుల్తానా

**మలక్ పేట ,అక్టోబర్ 21, ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మస్రత్ సుల్తానా పేర్కొన్నారు. ఎఐసిసి పరిశీలకులు అమీన్ పటేల్ ను నాయకులు కార్యకర్తలతో కలిసి ఆమె మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని మార్కెట్లను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆధునీకరిస్తున్నామని వివరించారు. గ్రేటర్లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అమరుల త్యాగాలు వెలకట్టలేనివి : రాచకొండ సిపి



**నేరెడ్ మెట్, అక్టోబర్ 21,ప్రభాతవార్త :** పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని, శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రాణాలు అర్పించిన వారి ఋణాన్ని సమాజం ఎప్పటికీ మరువలేదని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు, ఐపీఎస్ స్పష్టం చేశారు. మంగళవారం అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా అంబర్‌పేట్ కార్ హెడ్‌క్వార్టర్స్‌లో సిపి సుధీర్ బాబు డీసీపీలు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి అమరవీరుల స్థూపానికి పుష్పగుచ్ఛాలు సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విధి నిర్వర్తనలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సమాజం ఎల్లప్పుడూ అమరవీరుల కుటుంబాలకు రుణపడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.అమరవీరుల కుటుంబాలకు సత్కారంరాచకొండ కమిషనరేట్ పరిధిలో తీవ్రవాదుల చేతిలో ప్రాణాలు అర్పించిన 16 మంది అమరవీరుల కుటుంబ సభ్యులను సత్కరించినట్లు తెలిపారు. వారి త్యాగాలు మరువలేనివని, ఎల్లప్పుడూ వారికి తోడుగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా అంబర్‌పేట్ కార్ హెడ్‌క్వార్టర్స్‌లో అమరవీరుల జ్ఞాపకార్థం రక్తదాన శిబిరాన్ని సిపి ప్రారంభించారు. వందలాది మంది పోలీస్ సిబ్బంది పాల్గొని రక్తదానం చేశారు. అమరుల త్యాగాలకు నిజమైన గౌరవం ఇలాంటివేనని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి డీసీపీ పద్మజా ఐపీఎస్, ఎల్బీనగర్ డీసీపీ అనురాధ ఐపీఎస్, క్రైమ్స్ డీసీపీ అరవింద్ బాబు, అడ్మిన్ డీసీపీ ఇందిరా, మహిళా భద్రత డీసీపీ ఉషారాణి, మహేశ్వరం డీసీపీ సునీత రెడ్డి, ట్రాఫిక్1 డీసీపీ శ్రీనివాస్, ట్రాఫిక్2 డీసీపీ శ్రీనివాసులు, సైబర్ క్రైమ్స్ డీసీపీ నాగలక్ష్మి, రోడ్ సేఫ్టీ డీసీపీ మనోహర్, హెడ్‌క్వార్టర్స్ డీసీపీ శ్యామ్‌సుందర్, అదనపు డీసీపీలు, ఏసీపీలు తదితరులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా కొత్తపేట సదర్ సమ్మేళనం

**-దున్నపోతుల విన్యాసాలు**
**-డప్పు వాయిద్యాలతో నృత్యాలు**


ఏసిపి కృష్ణయ్య, ఇన్స్పెక్టర్ సైదులును సన్మానిస్తున్న యాదవ సంఘం నాయకులు

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 21 ప్రభాతవార్త:** సదరు సమ్మేళనం కార్యక్రమం కొత్తపేట యాదవ సంఘం ఆధ్వర్యంలో అట్టహాసంగా నిర్వహించారు. కొత్తపేట డివిజన్ మారుతినగర్ చౌరస్తా వద్ద పెద్దఎత్తున విద్యుత్ అలంకరణతో భారీ వేదికను ఏర్పాటు చేశారు. సుందరంగా అలంకరించిన దున్నపోతులను వేదిక వద్దకు యాదవులు తీసుకువచ్చి వాటితో పలురకాల విన్యాసాలను చేయించారు. జైయాదవ్, జైమాధవ్ అంటూ నినాదాలతో ఊరేగింపుగా యాదవులు సదర్ సమ్మేళనానికి తరలివచ్చారు. పలు ప్రాంతాల నుంచి దున్నపోతులను సుందరంగా అలంకరించి డప్పు వాయిద్యాలతో, యువకుల నృత్యాల మధ్య ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఈ కార్యక్రమానికి రాజ్యసభ సభ్యుడు మందాడి అనిల్‌కుమార్‌యాదవ్, ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా, మాజీ ఎంపీ మధుయాష్కిగౌడ్, అఖిలభారత యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చింతల రవీందర్‌యాదవ్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్, కార్పొరేటర్ గొంటి శంకర్‌యాదవ్, ఎల్బీనగర్ మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ లింగాల నాగేశ్వరరావు, ఎల్బీనగర్ ఏసీబీ కృష్ణయ్య, చైతన్యపురి ఇన్స్పెక్టర్ సైదులు, కార్పొరేటర్లు నాయకోటి పవన్‌కుమార్, బొంతు శ్రీదేవియాదవ్, నాయికోటి పవన్‌కుమార్, కొత్తపేట డివిజన్ టిఆర్ఎస్ అధ్యక్షుడు లింగాల రాహుల్‌గౌడ్ హాజరుకాగా వారిని నిర్వాహకులు శాలువాతో సన్మానించి శ్రీకృష్ణుడి చిత్రపటాన్ని బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట యాదవ సంఘం అధ్యక్షుడు తోట శ్రీనివాస్‌యాదవ్, ముఖ్యసలహాదారుడు తోట కృష్ణయాదవ్, సభ్యులు తోట సురేష్‌యాదవ్, తోట మహేష్‌యాదవ్, బుల్లెట్ వెంకటేష్‌యాదవ్, తోట గోపాల్‌యాదవ్, తోట శంకర్‌యాదవ్, కొరివి శ్రీనివాస్‌యాదవ్, తోట శ్రీనివాస్‌యాదవ్, తోట మధుయాదవ్, రాగం మునిస్వామి, తోట ఆనంద్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలుగు సంస్కృతి సంప్రదాయాలు ఎంతో గొప్పవి : యశీత


సమావేశంలో మాట్లాడుతున్న యశీత, ఐశ్వర్య, చిత్రంలో అనురాధ తదితరులు

**మలక్ పేట,అక్టోబర్ 21, ప్రభాతవార్త:** తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవని చాప్టర్ 30 నిర్వాహకులు యశీత, ఐశ్వర్యాలు పేర్కొన్నారు. మలక్ పేట మహిళా భవనంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తెలుగు సంస్కృతి, సంప్రదాయాల విశిష్టత, వాటి ప్రాముఖ్యత, గొప్పతనం గురించి సమాజానికి తెలియజేయాలని ఉద్దేశంతో తమ చాప్టర్ 30 ఆధ్వర్యంలో ఈ నెల 25, 26వ తేదీ శనివారం, ఆదివారాలలో బంజర హిల్స్ రోడ్ నెంబర్ 8లోని సప్తపరనిలో ఖిస్మృతిఖి మన సంస్కృతి, మన కళలు, మన కథలు అనే ప్రదర్శనశాలలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. గతంలో ఎవరు ఎప్పుడు నిర్వహించని విధంగా తమ ప్రదర్శనశాలలో మన ఆంధ్ర, తెలంగాణ సంప్రదాయాలు, కట్టుబాట్లు, సాంస్కృతి, హ్యాండ్లూమ్స్ జ్యువలరీ, పాతకాలం నాటి ఆహారపు అలవాట్ల గురించి మన ప్రజలకు తెలియజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. సుమారు 30 సంవత్సరాలు అంతకన్నా ముందు మనం మర్చిపోయిన కనుమరువవుతున్న సాంస్కృతి, సంప్రదాయాలను మరల గుర్తు చేయడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అని తెలియజేశారు. వివిధ అంశాలకు సంబంధించిన దాదాపు 50 కి పైగా ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. అదేవిధంగా నాలుగు లైవ్ షోలు, బుర్రకథ, హరికథ, తోలుబొమ్మలాటలు, కూచిపూడి తదితర ఆసక్తికరమైన అంశాలను ప్రదర్శించడంతోపాటు మరికొన్ని వర్క్ షాప్ లను కూడా నిర్వహిస్తున్నట్లు వివరించారు. మొట్ట మొదటిసారిగా హైదరాబాద్ నగరంలో తెలుగు సంస్కృతి, సంప్రదాయాల గురించి ప్రజలకు తెలియజేయడం కోసం ఈ కార్యక్రమాన్ని ఉచితంగా నిర్వహిస్తున్నామని,అందరూ ఆహ్వానితులేనని, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాజం అధ్యక్షురాలు అనురాధ తదితరులు పాల్గొన్నారు.

## ముసారాంబాగ్ ఆస్మాన్‌ఘాడ్‌లో అగ్ని ప్రమాదం


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

**మలక్ పేట ,అక్టోబర్ 21, ప్రభాతవార్త:** షార్ట్ సర్క్యూట్ తో అగ్ని ప్రమాదం సంభవించిన సంఘటన మలక్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ముసారాంబాగ్ అస్మాన్ ఘాడ్ లో సయ్యద్ నవీన్ హసన్ కుటుంబంతో కలిసి తన నివాసంలోని మొదటి అంతస్తులో నివసిస్తున్నారు. గ్రౌండ్ ఫ్లోర్ లో కార్ పార్కింగ్, స్టోర్ రూమ్ లూ ఉన్నాయి. కాగా సోమవారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తు మంటలు చెలరేగడంతో స్థానికులు గమనించి మలక్ పేట పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే సంఘటన ప్రాంతానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పి వేశారు. అగ్ని ప్రమాదం ములంగా స్టోర్ షోరూంలోని ఫర్నిచర్, బెడ్డు, సోఫా తదితర వస్తువులు కాలిపోయాయి .అయితే ఎవరికి ఎటువంటి ప్రాణం నష్టం జరగలేదు. షార్ట్ సర్క్యూట్ మూలంగా అగ్ని ప్రమాదం జరిగి ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. సుమారు లక్ష ఆస్తి నష్టం సంభవించి ఉండవచ్చునని అంచనా వేస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## వేం నరేందర్‌రెడ్డితో పరమేశ్వర్‌రెడ్డి బేటి


రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డితో బేటి అయిన కాంగ్రెస్ పార్టీ నేత ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, అక్టోబరు 21 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్ రెడ్డితో సోమవారం పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు బేటి అయ్యారు. ఉప్పల్ ,మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీలు మందుముల పరమేశ్వర్ రెడ్డి,వజ్రేష్ యాదవ్, టిపిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి బూపతి రెడ్డి తదితరులు వేం నరేందర్‌రెడ్డిని కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న సంక్షేమ పథకాల గురించి చర్చించినట్లు వారు తెలిపారు.అనంతరం వేం నరేందర్‌రెడ్డిని కలిసి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

**శ్రీ శివ శంకర మహామాయి ఆలయంలో ఘనంగా పూజలు**

**ఉప్పల్, అక్టోబరు 21 ప్రభాతవార్త :** ఉప్పల్‌లోని శ్రీ శివ శంకర మహా మాయి దేవాలయంలో అమావాస్య సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు, అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో దేవాలయ కమిటి సభ్యులు ఉప్పొజి బలవంతాచారి, రాజగోపాలాచారి, శ్రీనివాస్, పవన్, చోల్లేటి బ్రహ్మాచారి, శ్రీధర చారి,పాలేర్ల గోపి, సతీష్, శ్రీనివాస్, శ్రీనివాస్ శర్మ, బజార్ జగనాడజ్ గౌడ్,శామీర్‌పేట హనుమంత్ రెడ్డి, కృష్ణారెడ్డి,పాలకుర్త శ్రీనివాస్, ప్రవీణ్, కృష్ణ రెడ్డి,జగన్,యాపురం శ్రీనివాస్,గుండాల అనిల్ రెడ్డి,ప్రవీణ్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## రామంతాపూర్‌లో ఘనంగా క్రీస్తు జయంతి జుబ్లీ వేడుకలు


సెయింట్ జాన్ సెమినరీలో జరిగిన క్రీస్తు జయంతి జుబ్లీ వేడుకల్లో పాల్గొన్న వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బిషప్‌లు దృశ్యం.

**ఉప్పల్, అక్టోబరు 21 ప్రభాతవార్త :** రామంతాపూర్‌లోని సెయింట్ జాన్ సెమినరీలో సోమవారం క్రీస్తు జయంతి జుబ్లీ వేడుకలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి బిషప్‌లు, ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో నగరానికి చెందిన బిషప్ కార్డికల్ పూల అంథోని, ఖమ్మం బిషప్ సగిలి ప్రకాష్, కడప బిషప్ ససినాల ప్రకాష్, కర్నూల్‌కు చెందిన గోరంట్ల జాన్‌సీస్, నల్లగొండ బిషప్ కరణం దమన్ కుమార్, వరంగల్‌కు చెందిన విజయ్‌పాల్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా పలువురు బిషప్‌లు ప్రసంగించారు. క్రీస్తు బోధనలు ఆచరణీయమని, తాము చేపడుతున్న వివిధ కార్యక్రమాల గురించి వివరించారు. అంతకు ముందు నృత్య రూపకం ప్రదర్శించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన ఈ సమావేశంలో వివిధ ప్రాంతాల నుంచి బిషప్‌లు, ప్రముఖులు పాల్గొన్నారు.

## అమావాస్య సందర్భంగా చంపాపేటలో అన్నదానం


అన్నదానం చేస్తున్న కమిటి చైర్మన్ భగవాన్ తదితరులు

**సైదాబాద్, అక్టోబరు 21 ప్రభాతవార్త:** అన్ని దానాల్లో అన్నదానం గొప్పదని శ్రీ మాత అన్నపూర్ణేశ్వరి అన్న ప్రసాద వితరణ కమిటి చైర్మన్ దండేటికార్ భగవత్ జి(భగవాన్) అన్నారు. అమావాస్య సందర్భంగా మంగళవారం శ్రీ మాత అన్నపూర్ణేశ్వరి అన్న ప్రసాద వితరణ కమిటి ఆధ్వర్యంలో చంపాపేటలోని శ్రీ నల్ల పోచమ్మ ఎర్ర పోచమ్మ దేవాలయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటి చైర్మన్ భగవాన్ మాట్లాడుతూ గత 30 మాసాలుగా ప్రతి అమావాస్య రోజు అన్నదానం నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్బినగర్ బిఆర్ఎస్ యూత్ వింగ్ అధ్యక్షుడు రవి ముదిరాజ్, కమిటి సభ్యులు సుశీల్ కుమార్, సంతోష్ లడ్డ, చింటు, ఆడెళ్ల రాజు, టింగ్లికార్ రాజేష్, తిలక్ రాజ్, విఠల్ పాల్గొన్నారు.

**కాల భైరవస్వామి ఆలయంలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పూజలు**


ఉప్పల్ భగాయత్‌లోని శ్రీ కాల బైరవస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, అక్టోబరు 21 ప్రభాతవార్త :** ఉప్పల్‌లోని శ్రీ కాల భైరవ స్వామి ఆలయంలో సోమవారం అమావాస్య సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శ్రీ కాల భైరవ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ శ్రీ కాల భైరవ స్వామి దయతో ఉప్పల్ నియోజకవర్గం ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ప్రతి నెలా అమావాస్య సందర్భంగా ఆలయంలో పూజలు నిర్వహిస్తే భక్తుల కోరికలు నెరవేరుతాయని భక్తులు విశ్వసిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆలయ కమిటి నేతలు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**మంత్రి శ్రీధర్‌బాబుతో ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి బేటి**


రాష్ట్ర ఐటిశాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో బేటి అయిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, అక్టోబరు 21 ప్రభాతవార్త :** రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుతో సోమవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బేటి అయ్యారు. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గం సమస్యలను మంత్రికి వివరించినట్లు తెలిపారు. నియోజకవర్గం అభివృద్దికి మంత్రి శ్రీధర్‌బాబు సహకారం ఉండాలని ఆయన కోరారు. అనంతరం మంత్రికి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో రవి కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

**పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌తో కాంగ్రెస్ నేతల బేటి**


పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను సత్కరిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, అక్టోబరు 21 ప్రభాతవార్త :** తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బి.మహేష్ కుమార్‌గౌడ్‌తో సోమవారం మల్కాజిగిరి పరిధిలోని పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు బేటి అయ్యారు. ఉప్పల్ నాయోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్ రెడ్డితోపాటు మేడ్చల్ నియోజకవర్గం నేత వజ్రేష్‌యాదవ్, నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం దీపావళి పండుగ సందర్భంగా పిసిసి అధ్యక్షుడిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

**పార్టీ కోసం పనిచేసే కార్యకర్తకు డిసిసి ఇవ్వాలి**


రాబర్ట్‌బ్రూస్‌కు పత్రాన్ని అందజేస్తున్న శశిధర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 21 ప్రభాతవార్త:** నిరంతరం పార్టీ కోసం పనిచేసే నిజమైన కార్యకర్తకు డిసిసి బాధ్యతలు అప్పగించాలని చైతన్యపురి డివిజన్ కంటెస్ట్ కార్పొరేటర్ ఎస్.శశిధర్‌రెడ్డి సూచించారు. రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి బాధ్యతకు సంబంధించి జరిగిన సమావేశంలో డిసిసి బాధ్యతలు తనకు ఇవ్వాలని కోరుతూ ఎంపీ రాబర్ట్‌బ్రూస్‌కు శశిధర్‌రెడ్డి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ ఎన్ఎస్‌యుఐ, యూత్‌కాంగ్రెస్, కాంగ్రెస్ పార్టీలో గత 38 సంవత్సరాలుగా నిబద్ధతతో పనిచేస్తున్నానని తెలిపారు. పార్టీ అధికారంలో ఉన్నా, లేకున్నా కాంగ్రెస్ జెండా మోస్తున్న నిజమైన నికార్సైన కాంగ్రెస్ కార్యకర్తలకు డిసిసి బాధ్యతలు ఇవ్వాలన్నారు. నిజమైన కాంగ్రెస్ కార్యకర్తకు ఇస్తే పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షుడు చల్ల నరసింహారెడ్డి, మాజీ ఎంపీ మధుయాష్కిగౌడ్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి, తెలంగాణ సేవాదళ్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.జితేందర్, కాంగ్రెస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, ముద్దగొని రామ్మోహన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అందెల శ్రీరాములు యాదవ్‌కు పితృ వియోగం

**పరామర్శించిన బిజెపి ప్రముఖులు, నాయకులు**


అందెల శ్రీరాములు యాదవ్‌ను పరామర్శిస్తున్న బిజెపి ఎమ్మెల్యేలు కాటేపల్లి వెంకటరమణారెడ్డి, పైడి రాకేష్‌రెడ్డిలు

**సరూర్‌నగర్, అక్టోబర్ 21 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి, కాంటెస్టెడ్ ఎమ్మెల్యే, రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల బిజెపి కన్వీనర్ అందెల శ్రీరాములు యాదవ్‌కు పితృ వియోగం కలిగింది. ఆయన తండ్రి అందెల ఆగమయ్య (78) దీర్ఘ కాల అనారోగ్యంతో దీపావళి రోజు సోమవారం మధ్యాహ్నం ఓ ప్రైవేటు ఆసుపత్రిలో తుది శ్వాసం విడిచారు. ఈ నేపథ్యంలో మంగళవారం అందెల స్వగ్రామం నాదర్‌గుల్ గ్రామంలో జరిగిన ఆగమయ్య అంత్యక్రియలకు పలువురు బిజెపి ప్రముఖులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు, గ్రామస్తులు హాజరయ్యారు. చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మల్కాజిగిరి ఎంపి ఈటెల రాజేందర్, కామారెడ్డి ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేష్, మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం, రాష్ట్ర బిజెపి ప్రధాన కార్యదర్శి తూళ్ళ వీరేందర్‌గౌడ్, రంగారెడ్డి జిల్లా బిజెపి మాజీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డిలతో పాటు పలువురు హాజరై ఆగమయ్య భౌతిక కాయానికి నివాళులర్పించి అందెల శ్రీరాములు యాదవ్‌ను పరామర్శించారు.

**నాదర్‌గుల్‌లో యాదవుల సదర్ సమ్మేళనం**


నాదర్‌గుల్‌లో సదర్ సమ్మేళనానికి హాజరైన తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి: పక్కన మహేశ్వరం నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వల్లపు సుభాన్ యాదవ్ తదితరులు

**సరూర్‌నగర్, అక్టోబర్ 21 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్ గ్రామంలో సోమవారం రాత్రి యాదవుల దీపావళి సదర్ సమ్మేళనం కనుల పండువగా జరిగింది. గ్రామానికి చెందిన నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వల్లపు సుభాన్ యాదవ్, ఆయన సోదరుడు వల్లపు లడ్డూ యాదవ్‌ల ఆధ్వర్యంలో సదర్ ఉత్సవాన్ని ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగేందర్‌రెడ్డిలతో పాటు జెనిగె రవి యాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, కొత్తకురుమల యశ్వంత్ యాదవ్, వెంకటేశ్‌గౌడ్, సామ వరుణ్‌రెడ్డి తదితరులు హాజరై సదర్ మేళాకు వస్తున్న వారికి స్వాగతం పలికారు. కాగా యాదవుల సదర్ సమ్మేళనం సందర్భంగా ముస్తాబు చేసిన దున్నపోతులను ప్రదర్శనగా తీసుకొచ్చి ఊరేగించారు.

## అమావాస్య అన్నప్రసాద వితరణ


అన్న ప్రసాదం అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

**ఎల్.బి.నగర్, అక్టోబర్ 21 ప్రభాతవార్త:** అమావాస్య అన్నప్రసాద వితరణ కార్యక్రమం మంగళవారం నాగోల్ చౌరస్తాలో శ్రీవాసవి అన్నపూర్ణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. అమావాస్య అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త ముఖ్యఅతిథిగా హాజరై ప్రజలకు అన్నప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నప్రసాద వితరణ కార్యక్రమం ప్రతి అమావాస్యకి నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు. భవిష్యత్తులో కూడా అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని కొనసాగించాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నాగోల్ ఆర్యవైశ్య సంఘం ఫౌండర్ అధ్యక్షుడు జోగిని అశోక్, ప్రధానకార్యదర్శి అనిల్‌కుమార్, కోశాధికారి సాయిగణేష్, వీరేందర్, ఆర్యవైశ్య సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**పూజారి కుటుంబానికి గాయత్రీ సేవా సంఘం ఆపన్న హస్తం**


పూజారి లక్ష్మణాచారికి రూ.45 వేల చెక్కును అందజేస్తున్న మీర్‌పేట్ గాయత్రీ సేవా సంఘం ప్రతినిధులు

**సరూర్‌నగర్, అక్టోబర్ 21 ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అల్మాస్‌గూడ షిర్డీనగర్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ ఉప పూజారి లక్ష్మణాచారి కుమారుని వైద్య చికిత్సలకు మీర్‌పేట్ గాయత్రీ సంఘం ఆపన్న హస్తం అందించింది. ఈ మేరకు సంఘం తరపున లక్ష్మణాచారికి రూ.45 వేల చెక్కును అందజేశారు. గాయత్రీ సేవా సంఘం మీర్‌పేట్ కోశాధికారి బాపిరాజు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస ప్రసాద్, కార్యవర్గ సభ్యులు కృష్ణారావు, లక్ష్మణరావులు మంగళవారం ఆలయానికి వెళ్ళి లక్ష్మణాచారికి ఆర్థిక సాయాన్ని అందజేశారు.


రాగన్నగూడ ఎంఎంకుంట (మన్నె ముత్యాలకుంట) గ్రామ విశ్రాంత రైతు మర్రి బాల్‌రెడ్డి భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి